ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 09-07- 2026 | సంపుటి: 17, సంచిక: 96, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



# గ్రీన్ గ్రోత్ సమ్మిట్

**హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ**

- తెలంగాణలో గ్రీన్ పెట్టుబడులు, భవిష్యత్ పారిశ్రామిక అవకాశాలపై విస్తృత చర్చ
- మౌలిక సదుపాయాలు, ఏఐ, ఈఎస్జీ ప్రమాణాలపై ప్రతినిధుల ఆసక్తి
- అమెరికా, మలేషియా, నార్వే, దక్షిణాఫ్రికా తదితర దేశాల ప్రతినిధులు
- ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణ అనుకూల గమ్యస్థానమని సీఎం వివరణ
- గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్-2026లో కీలక చర్చలకు హైదరాబాద్ వేదిక

**హైదరాబాద్, జూలై 8 (ప్రజాకలం) :** హైదరాబాద్ వేదికగా జరుగుతున్న గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్-2026 రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే దిశగా కీలక వేదికగా మారింది. సమ్మిట్‌లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్ భాగస్వామ్యాలపై విస్తృతంగా చర్చించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో మలేషియా పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఎం. శరవణన్, అమెరికాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ బోర్డు డైరెక్టర్ నిలి గిల్బర్ట్, అమెరికా వాణిజ్య శాఖ మూమెంటమ్ టెక్నాలజీస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహేష్ కొండూరు, ఓక్సన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫ్యూచర్ కౌన్సిల్ కో-చైర్ అమిత్ మెహ్రా, నార్వే ప్రభుత్వ మాజీ స్టేట్ సెక్రెటరీ, ఓషన్ హౌస్ గ్లోబల్ స్ట్రాటజీస్ సలహాదారు దిలెక్ అయహన్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు థామస్ ప్రోలిక్,

తరువాయి 2వ పేజీలో...

ఫేక్ అకౌంట్‌లతో ధరణి,
## భూభారతిలో భారీగా అక్రమాలు

**సమగ్ర దర్యాప్తు చేయాల్సిందే**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, జూలై 8 (ప్రజాకలం) :** 'రాష్ట్రంలో భూ పరిపాలన అస్తవ్య స్తంగా మారింది. అప్పుడు ధరణి, ఇప్పుడు భూభారతి పోర్టల్‌లో ఫేక్ అకౌంట్‌లు వెలుగులోకి వచ్చాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ హయాం లో ధరణి పోర్టల్‌లో భారీగా ఫేక్ అకౌంట్‌లు సృష్టించారని, వాటిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలోనే సుమారు 2 వేల ఫేక్ అకౌంట్లు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తుంద న్నారు. ధరణిపై విచారణ జరుపుతున్న 'సిట్' పరిధిని విస్తరించి, భూభారతి అవకతవకలపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడారు. ధరణి, భూభారతి పోర్ట ళ్లలో అక్రమాలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి నాట కాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. సమగ్ర విచారణ చేసి అవినీతిలో భాగస్వాములైన రాజకీయ నాయకులు,

తరువాయి 2వ పేజీలో...

పేదవాళ్ల ఆత్మగౌరవానికి చిహ్నం
# ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాల అమలు**

రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం



ప్రజా కలం జులై 8 (గద్వాల ప్రతినిధి) పేదవాళ్ల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇండ్లు నిలుస్తాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ధరూర్ మండలం ర్యాలంపాడు పునరావాస గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామానికి చేరుకున్న మంత్రులకు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేల తాళాలతో, బాణసంచా కాలుస్తూ ముఖ్య అతిథులను ఘనంగా స్వాగతించారు. ఇందిరమ్మ ఇండ్ల శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి పలువురు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 26 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకోగా ప్రజాప్రతినిధులు

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




# ఇరాన్‌పై భీకర దాడులు చేస్తాం

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్**

హోర్ముజ్ వద్ద నౌకలపై ఇరాన్ దాడులపై ఆగ్రహం
ఇరాన్‌లోని 80 లక్ష్యాలపై అమెరికన్ సైన్యం దాడులు
గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలను టార్గెట్ చేసిన ఇరాన్

వాషింగ్టన్/టెహ్రాన్, జూలై 8: అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం (సీజ్‌ఫైర్) ఇక ముగిసిందని, మళ్లీ దాడులకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తుర్కియేలోని అంకారా వేదిక బుధవా రం జరిగిన 'నాటో' శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇకపై ఇరాన్‌తో చర్చలు పెట్టే ఉద్దేశమే లేదని స్పష్టం చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇవాళో రేపో సీజ్‌ఫైర్ ఒప్పందం జరుగుతుందని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారుతాయని ప్రపంచ దేశాలు ఆకాంక్షిస్తున్న వేళ ట్రంప్ ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తున్నది. మంగళవారం



హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ సైన్యం మూడు వాణిజ్య నౌకలపై దాడులకు పాల్పడటం ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది.

తరువాయి 2వ పేజీలో...

రేవంత్, ఉత్తమ్‌లను ఉరి తీసినా
# పాపం లేదు

**తుమ్మిడిహట్టికి మహారాష్ట్ర అనుమతించినట్లు ఆధారం చూపితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా**

**సమ్మక్క బ్యారేజీపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం - బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జూలై 8 (ప్రజాకలం) :** 'నీకు కేసీఆర్ అవసరం లేదు.. నేను చాలు. నాకు మూడు నెలల పాటు ఇరిగేషన్ శాఖను అప్పగించు... నీళ్లు ఎలా తేవాలో నీకు చూపిస్తా. ఒకవేళ తేలేకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా.. ఇందుకు నువ్వు సిద్ధమేనా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాలు విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచమంతా చుక్క చుక్క నీటిని ఒడిసిపడుతుంటే... రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ

తరువాయి 2వ పేజీలో...



వివాదాస్పదంగా మారిన
# బెల్ట్ షాపు టెండర్..?

## ఆత్మకూరులో విడిసిల అగడాలు..?

**విడీసీల సమాంతర పాలనపై విమర్శలు..!**
**బెల్ట్ షాపుల నిర్వహణపై నోరుమెదపని అబ్కారీ శాఖ**
**చిరు వ్యాపారులపై విడిసిల పెత్తనం..!!**



**మెటపల్లి: (కోరుట్ల) ప్రతినిధి జూలై 8 (ప్రజా కలం)**

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బెల్ట్ షాపులను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్న నేపథ్యంలో, కొన్ని గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీలు (విడిసిలు) బెల్ట్ షాపుల నిర్వహణకు టెండర్లు నిర్వహించడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన విడిసిలు అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించిన టెండర్లు నిర్వహించడం చట్టబద్ధమేనా అనే అంశంపై అనేక రకాలుగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి చర్యలు ప్రభుత్వ విధానాలకు విరుద్ధమని, బెల్ట్ షాపుల నిర్మూలన లక్ష్యాన్ని దెబ్బతీసే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు ముఖ్యంగా లా అండ్ ఆర్డర్ విషయంలో పోలీసులు, అక్రమంగా బెల్ట్ షాపుల నిర్వహణపై స్పందించి, విడిసిలకు బెల్ట్ షాపుల టెండర్లు నిర్వహించే అధికారం విడిసి పేదలకు ఉందా అనే విషయాన్ని స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి డిమాండ్ వినవస్తుంది.

తరువాయి 2వ పేజీలో...

# డిపాజిట్ నిధులు డ్రా

## అభ్యర్థులకు మాత్రం అందని సొమ్ము..!

- అందని ద్రాక్ష గా అభ్యర్థుల డిపాజిట్ డబ్బు
- డ్రా చేసిన పంపిణీ కాకపోవడం పై తీవ్ర అనుమానాలు
- మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న అభ్యర్థులు
- జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలి అని డిమాండ్




**మల్లాపూర్, జూలై 08 (ప్రజా కలం ప్రతినిధి)**

మల్లాపూర్ మండలంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము ఇప్పటికీ అందకపోవడం తో మండల అధికారి తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ముగిసి సుమారు ఆరు నెలలు గడిచినా అభ్యర్థులకు డిపాజిట్ నగదు అందకపోవడంతో అధికారి తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో మొత్తం 72 మంది సర్పంచ్ అభ్యర్థులు, అలాగే సుమారు 284 నుంచి 300 మంది వరకు వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు సమాచారం ఉండగా ఎన్నికల నిబంధనల ప్రకారం జనరల్ సర్పంచ్ అభ్యర్థుల నుంచి రూ. 2,000, బీసీ, ఎస్సీ సర్పంచ్ అభ్యర్థుల నుంచి రూ. 1,000 చొప్పున డిపాజిట్‌గా వసూలు చేశారు.

తరువాయి 2వ పేజీలో...



## భారత చమురు ట్యాంకర్ వెనక్కి..
# రంగంలోకి కేంద్ర ప్రభుత్వం!

న్యూఢిల్లీ, జులై 8: పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ పరస్పర సైనిక దాడులతో వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన ఒమన్ కారిడార్ గుండా ప్రయాణిస్తున్న ఓ భారత చమురు ట్యాంకర్‌ను ఇరాన్ భద్రతా దళాలు అడ్డుకుని, వెనక్కి పంపించినట్లు తెలుస్తోంది. అమెరికా పర్యవేక్షణలో సాగుతున్న ఒమన్ తాత్కాలిక కారిడార్‌ను కాకుండా, హోర్ముజ్ జలసంధిలో తాము నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలంటూ ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకలను హెచ్చరిస్తుండటం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది.

**కారిడార్ వివాదం ఏంటి?**

గల్ఫ్ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన వివిధ దేశాల వాణిజ్య నౌకలు వాటి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు వీలుగా ఒమన్ ప్రభు త్వం, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సముద్ర యాన సంస్థ లు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాయి.

తరువాయి 2వ పేజీలో...

# గ్రీన్ గ్రోత్ సమ్మిట్

మొదటి పేజీ తరువాయి...

సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు సెంథిల్ తొండమాన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, పెట్టుబడిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వేగవంతమైన అనుమతుల విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల గురించి ప్రతినిధులకు వివరించారు. ముఖ్యంగా సుస్థిర అభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో పర్యావరణ, సామాజిక, పరిపాలనా (ఈఎస్జి) ప్రమాణాలు, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, డిజిటల్ ఆవిష్కరణలు, భవిష్యత్ పెట్టుబడుల దిశగా పరస్పర సహకారం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. తెలంగాణను గ్రీన్ ఎకానమీ, ఆధునిక పరిశ్రమలు, సాంకేతిక ఆవిష్కరణలకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ నిర్వహిస్తున్న మెరీడియన్ కలెక్టివ్ ప్రతినిధులు రిత్వికా భట్టాచార్య, ఉమా భట్టాచార్య, లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీ ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, గ్రీన్ అభివృద్ధి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### రేవంత్, ఉత్తమ్‌లను ఉరి తీసినా

# పాపం లేదు

మొదటి పేజీ తరువాయి...

గోదావరి జలాలను రేవంత్‌రెడ్డి వృథాగా కిందకు జారవిడుస్తున్నారని ఆరోపించారు. గోదావరి నదిలో సమ్మక్క బ్యారేజీ వద్ద నిమిషానికి లక్ష క్యూసెక్కుల వరద ఉంటే.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా 2,542 క్యూసెక్కుల నీటిని మాత్రమే ఎందుకు లిఫ్ట్ చేస్తున్నారని ప్రశ్నించారు. సమ్మక్క బ్యారేజీ వద్ద 76 మీటర్ల ఎత్తులో నీళ్లున్నాయని, 71 మీటర్ల వద్దే దేవాదుల మోటార్లను నడపొచ్చని తెలిపారు. అయినా వాటిని ఆన్ చేయకపోవడంలో రేవంత్, ఉత్తమ్‌లది నేరపూరిత నిర్లక్ష్యమేనని వారిని ఉరి తీసినా పాపం లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకోవడానికే పొలాలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. గోదావరిలో ఇంత వరద ఉన్నా... ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 నుంచి 80 శాతం చెరువులు ఎండిపోయి ఎడారిలా మారుతోందని.. ఇద్దరు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదేమన్నారు.

**అబద్దాలకు అంగీ లాగు వేస్తే రేవంత్‌రెడ్డి..**

సమ్మక్క బ్యారేజీపై చర్చకు అసెంబ్లీ నిర్వహిస్తారా? నేను సిద్ధంగా ఉన్నాను. అబద్దాలకు నోబెల్ బహుమతి ఉంటే అది రేవంత్‌రెడ్డికే వస్తుంది. అబద్దాలకు అంగీ లాగు వేస్తే అది రేవంత్‌రెడ్డి... ఆయన పేరును అనుముల రేవంత్‌రెడ్డికి బదులు అబద్దాల రేవంత్‌రెడ్డి అని మార్చుకుంటే సరిపోతుంది' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టికి కాంగ్రెస్ హయాంలోనే అనుమతులు వచ్చాయంటూ రేవంత్‌రెడ్డి అసత్యాలు చెబుతున్నారని, ఢిల్లీలో, మహారాష్ట్ర, ఆంధ్రలలో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా సీడబ్ల్యూసీ అనుమతి ఎందుకు రాలేదన్నారు. తుమ్మిడిహట్టికి రూ.6వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, పనులు జరగకుండానే సర్వేలు, మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో రూ.2,328 కోట్లను పందికొక్కుల్లా మెక్కారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తు బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చినట్లు ఒక్క ఆధారాన్ని బయటపెట్టినా... తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. లేదంటే రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరానికి 18 కేంద్ర సంస్థల నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ప్రాజెక్టు నీటి వినియోగం 160 నుంచి 240 టీఎంసీలకు పెరిగిందని, ఆయకట్టు 16 లక్షల నుంచి 37 లక్షలకు పెరిగిందని, ప్రాణహితలో ఎకరాకు రూ.2 లక్షలు నష్టపరిహారం ఇస్తే... తాము రూ.16లక్షలు ఇచ్చామన్నారు. జలాశయాల సామర్థ్యాన్ని 141టీఎంసీలకు పెంచామని, ఆ మేరకు ఖర్చు పెరగదా అన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గతంలో రూ.1400కోట్లతో జీఓ ఇస్తే... ఇప్పుడు దాన్ని రూ.4,350 కోట్లకు ఎందుకు పెంచారో సీఎం చెప్పాలన్నారు. కాళేశ్వరమే లేకుంటే మూసీకి నీళ్లు ఎక్కడి నుంచి తెస్తారు.. మేడిగడ్డ కొట్టుకుపోతే సుందిళ్లకు నీటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఇంకో ఏడాదైతే కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, ఆ తర్వాత మేడిగడ్డకు రిపేర్ చేసి.. తెలంగాణకు నీరు అందిస్తామన్నారు.

# ఇరాన్‌పై భీకర దాడులు చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

దీంతో వెంటనే ఆయన అమెరికన్ సైన్యాన్ని రంగంలోకి దించి ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించారు. గురువారం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఖననం జరుగనున్న వేళ, ట్రంప్ హెచ్చరికలు కలకలం రేపుతున్నాయి. నాటో సదస్సు వేదికగానే ట్రంప్ మరింత తీవ్రంగా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశ పాలకులు మోసగాళ్లని, దుర్మార్గులని మండిపడ్డారు. వాళ్లొక మానసిక రోగులని, సమాజానికి తెగులు లాంటి వారని అభివర్ణించారు. వారితో చర్చలు జరపడం సమయం వృథా అని వ్యాఖ్యానించారు. వారు శాంతి ఒప్పందానికి విలువ లేకుండా చేశారని నిప్పులు చెరిగారు. వారితో అమెరికన్ ప్రతినిధులు చర్చలు జరపడం కూడా పనికిమాలిన పనేనని కొట్టి పడేశారు. ఇరాన్‌ను అణ్వాయుధ రహిత దేశంగా మార్చడమే, ప్రస్తుతం తమముందున్న ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు. అందుకు సైనిక చర్య తీసుకుంటామని స్పష్టంచేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలుంటే, ఆ దేశం ఏ క్షణంలోనైనా పొరుగు రాష్ట్రాలపై వినియోగించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇరాన్ ఆర్థిక మూలమైన ఖార్గ్ ద్వీపాన్ని కూడా తమ ఆధీనంలోకి తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. గత రాత్రి హోర్ముజ్ జలసంధి వద్ద దాడులు చేశామని, అవసరమైతే మరోసారి కూడా అదే స్థాయిలో దాడులు చేస్తామని స్పష్టం చేశారు.

ఇరాన్ ఒక చర్యకు పూనుకుంటే, ప్రతిచర్యగా అమెరికా 20 రెట్ల బలంతో సమాధానం ఇస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. ఇదే వేదికపై నాటో కూటమి దేశాలు అమెరికాకు తగినంత మద్దతు ఇవ్వడం లేదని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతి ఒప్పందం కోసం చర్చలు జరిగితే జరగవచ్చని, వాటిని తాను అడ్డుకోబోనని పేర్కొన్నారు.

**శక్తిమంతమైన దాడులు చేస్తాం..**

అమెరికా, ఇరాన్ మధ్య సీజ్‌ఫైర్ ఒప్పందం ముగిసిందని ప్రకటించిన కొద్దిసేపటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో షాకింగ్ హెచ్చరిక జారీ చేశారు. బుధవారం రాత్రికి రాత్రే ఇరాన్‌పై శక్తిమంతమైన దాడులు చేస్తామని ప్రకటించారు. టర్కీ నాటో శిఖరాగ్ర సదస్సు వేదికగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీకి ముందు ఆయన మీడియాతో ఈ వ్యాఖ్యలు చేశారు. పైగా, ఇరాన్‌కు అమెరికా ఇస్తున్న ఇదొక చిన్న హెచ్చరిక ఇస్తున్నామంటూ చమత్కరించారు.

## భారత చమురు ట్యాంకర్ వెనక్కి.. రంగంలోకి కేంద్ర ప్రభుత్వం!

మొదటి పేజీ తరువాయి...

ఒమన్ తీరం వెంబడి వెళ్లేలా అమెరికా భద్రతా పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక కారిడార్‌నే ప్రస్తుతం నౌకలు ఉపయోగిస్తున్నాయి. అయితే, ఈ మార్గంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాము సూచించిన హోర్ముజ్ మార్గాన్నే వినియోగించుకోవాలని నౌకలకు గట్టి హెచ్చరికలు జారీ చేస్తోంది.

**హోర్ముజ్‌లో 9 భారత నౌకలు..**

**198 మంది నావికుల బందీ!**

జలసంధి దిగ్బంధనం కావడంతో ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోనే తొమ్మిది భారతీయ చమురు ట్యాంకర్లు చిక్కుకుపోయాయి. వీటిలో పూర్తి స్థాయిలో ముడిచమురు, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ లోడ్ అయి ఉన్నట్లు సమాచారం. ఈ నౌకల్లో సుమారు 198 మంది భారతీయ నావికులు కూడా ఉన్నారు. గత కొన్ని నెలలుగా హోర్ముజ్ జలసంధి మూతపడటంతో వందలాది మంది నావికులు ఇక్కడే చిక్కుకుపోగా, తాజాగా యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో వీరి రక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెలలో జరిగిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడంతో భారత్ మరింత అప్రమత్తమైంది.

**రంగంలోకి భారత ప్రభుత్వం.. ఇరాన్‌తో సంప్రదింపులు?**

పర్షియన్ గల్ఫ్‌లో నెలకొన్న తాజా పరిస్థితులను, భారత నౌకల కదలికలను ఢిల్లీలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. నిలిచిపోయిన తొమ్మిది చమురు ట్యాంకర్లకు మార్గాన్ని సుగమం చేయడంతో పాటు, 198 మంది భారతీయ నావికులను క్షేమంగా తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకోసం ఇరాన్ ఉన్నతాధికారులతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు ఉన్న అన్ని దౌత్యపరమైన అవకాశాలను విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# పేదవాళ్ల ఆత్మగౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు

మొదటి పేజీ తరువాయి...

గ్రామానికి చెందిన సరోజ, గోవిందమ్మ, విశాలాక్షి, జయమ్మ ఇండ్లను ప్రారంభించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులకు కానుకలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగిస్తూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుందని, పాలమూరు బిడ్డే మన ముఖ్యమంత్రి కావడం గర్వకారణమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా కొత్త కార్యక్రమాలను కూడా అమలు చేసి ప్రజలకు చేరువ కావడం జరిగిందన్నారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, రెండో విడతలోను అర్హులైన వారందరికీ ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సాయం అందజేస్తుందన్నారు. మూడు, నాలుగు విడతల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇటీవల కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి వారి ఖాతాల్లో వారం రోజుల్లోనే డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. గద్వాల నియోజకవర్గంలో వివిధ మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలకు ఈ వేదికపై నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలు దేవుళ్ళతో సమానమని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులను నిర్మించుకొని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, నిర్మించుకునేందుకు సహకారం అందిస్తున్నామన్నారు. గుడిసెలు, పెంకుటిల్లు ఉన్న వారికి కూడా పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేయనున్నట్లు చెప్పారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణంతో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామంటే ఆ ఘనత నిర్వాసితులైన ఈ గ్రామస్తులదేనని ప్రశంసించారు. ఆలూరు, గుడ్డెం దొడ్డి, చిన్నోనిపల్లి వంటి ముంపు గ్రామాల బాధితుల కష్టాలు తీర్చేందుకు పునరావాస కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అందులో భాగంగానే ర్యాలంపాడు పునరావాస గ్రామంలో 236 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. పునరావాస గ్రామాల్లో నివసించే ప్రజలందరికీ ప్రభుత్వం అండగా నిలబడి, అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఇటీవల మహిళా సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేసి ఆడపడుచులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రుణాలను మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత మాట్లాడుతూ పేదవాళ్ల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం గర్వకారణం అన్నారు. ర్యాలంపాడుతో పాటు జిల్లాలోని ఇతర పునరావాస గ్రామాల్లోని ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారందరికీ సన్న బియ్యం, తదితర కార్యక్రమాలతో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ధరూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి గ్రామ సమస్యలపై ప్రసంగించి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే 62 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.5.74 కోట్ల విలువైన ఇందిర మహిళా శక్తి బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, గద్వాల మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి, గ్రామ సర్పంచి వెంకటరామిరెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# డిపాజిట్ నిధులు డ్రా

## అభ్యర్థులకు మాత్రం అందని సొమ్ము..!

మొదటి పేజీ తరువాయి...

అలాగే జనరల్ వార్డు సభ్యుల నుంచిరూ.1,000, బీసీ, ఎస్సీ, ఎస్టీ వార్డు సభ్యులనుంచి రూ.500 చొప్పున డిపాజిట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు ఈ డిపాజిట్ మొత్తాలను ఎన్నికల అనంతరం నెల లోపు తిరిగి చెల్లించాల్సి ఉన్న ఇప్పటికీ ఎందుకు చెల్లయించలేదో ప్రశ్నార్థకంగా మారింది. బాధిత అభ్యర్థుల ఆరోపణల ప్రకారం ప్రభుత్వం విడుదల చేసిన డిపాజిట్ నిధులు సంబంధిత అధికారి ఖాతాకు చేరడమే కాకుండా వాటిని డ్రా కూడా చేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఆ మొత్తాలను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. డ్రా చేసిన నిధులు ఎక్కడ నిలిచిపోయాయి? ఎందుకు పంపిణీ చేయడం లేదనే ప్రశ్నలు అభ్యర్థులు లేవనెత్తుతున్నారు. డిపాజిట్ సొమ్ము కోసం పలుమార్లు మండల కార్యాలయానికి వెళ్లినా మండల అధికారి మాత్రం స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా "రేపు రండి... తర్వాత రండి..." అంటూ కాలయాపన చేస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టబద్ధంగా రావాల్సిన సొమ్ము కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు మండిపడుతున్నారు.

డిపాజిట్ నిధుల చెల్లింపులో జరిగిన జాప్యంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని, నిధులు డ్రా చేసిన తర్వాత కూడా పంపిణీ ఎందుకు జరగలేదో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి అభ్యర్థికి డిపాజిట్ సొమ్మును వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం ఎలా స్పందిస్తుందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

# వివాదాస్పదంగా మారిన బెల్ట్ షాపు టెండర్..?

మొదటి పేజీ తరువాయి...

**విడీసీల సమాంతర పాలనపై విమర్శలు**

**ప్రభుత్వ వ్యవస్థకు సమాంతరంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు**

గ్రామాల్లో వీడీసీలు (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు) అధికారిక వ్యవస్థకు సమాంతరంగా వ్యవహరిస్తున్నారంటూ పలుచోట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ శాఖల పరిధిలో ఉండాల్సిన కొన్ని అంశాల్లో జోక్యం చేసుకోవడం, స్థానికంగా నిర్ణయాలు తీసుకోవడం, టెండర్ల నిర్వహణలో పాత్ర పోషించడం వంటి చర్యలపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి సహకరించాల్సిన వీడీసీలు తమ పరిధిని దాటి వ్యవహరించకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆత్మకూరులో విడిసిల అగడాలు..?**

మెట్‌పల్లి మండలం ఆత్మకూరు గ్రామంలో విడిసి ఆధ్వర్యంలో బెల్ట్ షాపుల టెండర్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వం ఒకవైపు బెల్ట్ షాపులను అరికట్టాలని చెబుతుండగా, స్థానికంగా మాత్రం అందుకు విరుద్ధంగా టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారని గ్రామ ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ నిర్వహణపై సంబంధిత అధికారుల వద్ద అధికారిక సమాచారం లేదని తెలుస్తోంది. అయినప్పటికీ గ్రామంలో టెండర్ నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బెల్ట్ షాపులు నిర్వహించిన కొందరిపై మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ మద్యం దుకాణ యజమాని తన వద్ద నుంచే మద్యం కొనుగోలు చేయాలని ఒత్తిడి చేశారని, వారు నిరాకరించడంతో ఈసారి వారి నిర్వహణకు అడ్డంకులు సృష్టిస్తామని బెదిరించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ఏడాది టెండర్ ప్రక్రియలో గ్రామానికి చెందిన ఓ బినామీ వ్యక్తి పేరుతో సుమారు రూ.4.20 లక్షలకు టెండర్ వేయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. టెండర్‌లో పాల్గొన్న వ్యక్తికి ఒక షాపును ఉచితంగా ఇవ్వాలని, విడిసికి చెల్లించాల్సిన టెండర్ మొత్తాన్ని ముగ్గురు కలిసి భరించాలని, అదనంగా ప్రతి షాపు నుంచి రూ.10 వేల చొప్పున "గుడ్‌విల్" పేరుతో వసూలు చేస్తున్నారని విమర్శలు వినవస్తున్నాయి. టెండర్ పొందిన వ్యక్తి గ్రామ పెద్దల సమక్షంలో షాపును ప్రారంభించి, ఆ కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రశ్నించే వారిని గ్రామ బహిష్కరణ చేస్తారనే భయంతో చాలామంది బహిరంగంగా మాట్లాడలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా సంబంధిత అంశంపై వివరణ కోరేందుకు ఈ విలేకరి ప్రయత్నించగా ఎవరు సమాధానం చెప్పకపోవడంతో అధికారులే స్పందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

**చిరి వ్యాపారుల పై విడిసిల పెత్తనం..**

మెట్‌పల్లి డివిజన్ లో పలు గ్రామాల్లో విడీసీల పేరుతో కొందరు పేద వ్యాపారులపై అనవసర ఒత్తిళ్లు, పెత్తనం కొనసాగుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో నిర్వహిస్తున్న టెండర్ల విషయంలో కొందరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేద వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నారని వారు ఆరోపించారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

# గురుకుల విద్యార్థుల ఆరోగ్య, భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**పారదర్శక అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలి - వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు - నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి**

**TGSWREIS , TGTWREIS సమీక్ష లో అధికారులను ఆదేశించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



హైదరాబాద్, జూలై 8:తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్య మైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీ రు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. తెలం గాణ రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం TGSWREIS, TGTWREIS విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షా కాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడు తూ... గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హు లైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికా రులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిం చాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షిం చి, అవసరమైన చోట వాటర్ ప్యూరిఫైయర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే చికిత్సకు పంపే విధంగా ఆరోగ్య ప్రోటోకాల్ అమలు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాళ్లు, నిల్వ గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల సరఫరా నిరంతరంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతను తరచుగా తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికా హారం, సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దశలవారీగా విస్తరించేందుకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, ఉన్నత విద్యా అవకాశాలు మరింత చేరువయ్యేలా సీఓఈల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల వేతనాలు ప్రతి నెలా ఒకటో తేదీన జమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వేతనాల విడుదలలో జాప్యం లేకుండా ఆర్థిక, పరిపాలనా ప్రక్రియలను ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. సిబ్బంది సంక్షేమం, సమయపాలన, బాధ్యతాయుతమైన సేవలతోనే విద్యార్థులకు మెరుగైన ఫలితాలు అందుతాయని పేర్కొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు



రుద్రంగి, జూలై 08, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని మేర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. డప్పు చప్పుల్లు బైండ్లోల్ల నృత్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సంవృద్ధిగా పండి, గ్రామ ప్రజలని సుఖసంతోషాలతో చల్లగా చూడాలని గ్రామ దేవత పోచమ్మ తల్లిని వేడుకున్నట్లు మేర కులస్థులు తెలిపారు. ఈ కారక్రమంలో మాజీ జడ్పీటీసి గట్ల మీనయ్య, సంఘ సభ్యులు పెద్ది లక్ష్మీ నర్సయ్య, గట్ల ప్రకాష్, శ్రీనివాస్, రాజు, సాగర్, కోడి గంటి శ్యామ్, పెద్ది రవి, కోడిగంటి ప్రకాష్, ఉమేష్, సుధీర్, మామిడిశెట్టి రామచంద్రం, శ్రావణ్, రాహుల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలోనే తీరిన ఇందిరానగర్ తాగునీటి సమస్య

### - స్పందించిన కాంగ్రెస్ పార్టీ 3వ వార్డు ఇంచార్జి బర్ల సూరి





మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 8 (ప్రజా కలం) మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఇందిరానగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యకు గంటల వ్యవధిలోనే పరిష్కారం లభించింది. కాలనీకి సరఫరా అయ్యే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ బ్లాక్ కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీవాసుల సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ 3వ వార్డు ఇంచార్జి బర్ల సూరి వెంటనే స్పందించి, ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బ్లాక్ అయిన పైప్‌లైన్‌ను యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన కాంగ్రెస్ నాయకుడు బర్ల సూరికి ఇందిరానగర్ కాలనీవాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### - బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



జగిత్యాల ప్రతినిధి జులై 8 (ప్రజాకలం) జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ బుధవారం బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే స్పందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే శాంతిభద్రతలు పరిరక్షించబడతాయని చెప్పారు.

ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొంటూ, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శించాలని, గ్రామాల పరిస్థితులపై పూర్తి సమాచారం కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ బోనాలు సమర్పించిన గంగా పుత్రులు

ఇబ్రహీంపట్నం జూలై 8 (ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ బోనాల వేడుకలు



భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గంగామాతకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు చిట్యాల రాజేందర్, ఉపాధ్యక్షులు తోపారపు ప్రసాద్, కార్యదర్శి తోపారపు మల్లేష్ పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు దుబాక సాగర్, చిట్యాల మహేందర్, మోహన్, తోపారపు నర్సయ్య, సంఘం పెద్దమనుషులు తోపారపు నడ్పి నర్సయ్య, చిట్యాల నడ్పి నర్సయ్య, సంఘ సభ్యులు దుబాక అశోక్, ఆశన్న, పందిరి రాములు, కల్లెడ రాకేష్, ఎల్ల జితేందర్‌తో పాటు సంఘ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి సంవత్సరం ఇదే విధంగా గంగమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ సంప్రదాయాలను పరిరక్షిస్తున్నామని తెలిపారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం

# చట్టరీత్యా నేరం

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇటుక బట్టీలపై ఆకస్మిక తనిఖీ



జగిత్యాల ప్రతినిధి జూలై 8 (ప్రజాకలం)

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలోని వీఆర్కే కాలేజ్ సమీపంలోని ఇటుక బట్టీని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితిని పరిశీలించి, బాలలను పనిలో నియమించారా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, సురక్షిత బాల్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని, వాటిని హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని చిన్నారులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను హోటళ్లు, టీ దుకాణాలు, గ్యారేజీలు, వర్క్‌షాప్‌లు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, గృహ సేవలు లేదా ఇతర ఉపాధి రంగాల్లో పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాలకార్మికులు, వీధి బాలలు, తప్పిపోయిన చిన్నారులు, బలవంతపు శ్రమకు గురవుతున్న పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి విద్య, వైద్యం, పునరావాసం కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినా లేదా బలవంతపు శ్రమకు గురవుతున్న చిన్నారుల సమాచారం తెలిసినా వెంటనే డయల్--100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్--1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అనిల్ కదం, డీసీపీఓ సురేశ్, ఎస్ఐ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు, డ్రై డే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ దోమల నివారణ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం**

**పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియాను అరికట్టవచ్చు**



జగిత్యాల్ ప్రతినిధి జులై 8 (ప్రజాకలం)

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డును సందర్శించిన జిల్లా కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణ, డ్రై డే కార్యక్రమాలు, యాంటీ లార్వా చర్యలు, ఫీవర్ సర్వేలు, దోమల నివారణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు వార్డుల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తిగా అదుపులోకి తీసుకురావాలంటే ప్రతి ఇంటిని పరిశీలించడం అత్యంత అవసరమన్నారు. ఇళ్లలో పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, నీరు నిల్వ ఉండే పాత్రలు వంటి వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రేలు, ఆయిల్ బాల్స్ వినియోగించాలని సూచించారు. ప్రతి రోజు డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఫీవర్ సర్వేలను నిరంతరం కొనసాగిస్తూ జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే పరీక్షలకు పంపించాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులనే నివేదికలుగా సమర్పించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని, "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం – సీజనల్ వ్యాధులను దూరం చేద్దాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు, మైకింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అలాగే వీధి ఆహార విక్రేతల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రి తగినంత అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ వైద్యాధికారి శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం



ఇబ్రహీంపట్నం జూలై 8 (ప్రజా కలం ప్రతినిధి )

బీపీడీపీ/జీపీడీపీ (బ్లాక్/గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్) పైన అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. 16 వ ఆర్థిక సంఘ ప్రణాళిక ద్వారా వచ్చే నిధులకు చేయవలసిన పనుల వివరములను ఎలా ఉపయోగించాలి. అట్టి నిధులకు మండల మరియు గ్రామ పంచాయతీ ల యొక్క ప్రణాళికలను ఎలా రూపొందించాలి, ఇట్టి ప్రణాళికలో అన్ని డిపార్ట్మెంట్ల అవశ్యకత ఏంటి, వారు ఇచ్చే నివేదికలు ఎలా ఇవ్వాలి అందరి సమన్వయంతో ఎలా పూర్తి అవుతుంది అనే అంశాలను క్లుప్తముగా వివరిస్తూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గణేష్. మరియు మండల పంచాయతీ అధికారి అంబటి వెంకట రామకృష్ణా రాజు వివరించడం జరిగింది. స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ఫారం ని ఎలా పూర్తి చేయాలి వాటిలోని సందేహాలను ఎంపిడిఓ వివరించడం జరిగింది. వీటితో పాటు సీజనల్ వ్యాధులు రాకుండా ఎలా నివారించాలి తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు గురించి మండల వైద్యాధికారి వనజ వివరించారు. ఇట్టి కార్యక్రమంలో తహాశీల్దార్ బి. వరప్రసాద్ డిప్యూటీ తహాశీల్దార్ ప్రసాద్, దివ్య, మనోజ్, హార్టికల్చర్ కే. శ్రీనివాస్, ఎఇ ఎలక్ట్రిసిటీ సతీష్, ఏఇ హోసింగ్ ఆకాంక్ష, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ శోభారాణి ఫారెస్ట్ ఆఫీసర్ ‌ూ చైతన్య ఏపీఎం శంకర్, సర్పంచులు పుప్పాల లక్ష్మీ, తోగరి రచన, తోట రమేష్, చల్ల రక్షిత, కానుగంటి లాస్య ప్రియ, తరి రామానుజం పొనకంటి వెంకట్, అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు, పంచాయతీ కార్యదర్శి లు, వివోల్ లు, సీసీ లు ఆఫీసు సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ ఒక చెట్టు నాటాలి:సర్పంచ్ జగన్ గౌడ్

### - జగ్గసాగర్‌లో ఘనంగా హరితహారం కార్యక్రమం



మెట్‌పల్లి రూరల్, జూలై 8:(ప్రజా కలం):

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రతి ఇంటికీ ఒక చెట్టు నాటాలని జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ జగన్ గౌడ్ పిలుపునిచ్చారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామములో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన హరితహారం లో భాగంగా బుధవారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని ప్రాణప్రదంగా కాపాడుకుంటూ సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపి, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జి. మమత, ఉపసర్పంచ్ లాక్మా చిన్నయ్య, గంగనర్సయ్య, నారాయణ, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### - నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

### - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 8 (ప్రజా కలం) పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం, ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి నిర్మాణంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఈ భవనాలు కీలకమని పేర్కొన్న కలెక్టర్, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన సామగ్రిని ఉపయోగించాలని స్పష్టం చేశారు. ప్రతి దశలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పనుల నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. నిర్మాణ పనులతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, తహసీల్దార్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### ఎస్.ఐ.ఆర్. నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జూలై 8 (ప్రజాకలం)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 37 వార్డులో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.



ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, బి.ఎల్.వో లు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసుల బాధితులకు ఊరట

### - ఈ నెల 18న జిల్లా కోర్టులో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల



పెద్దపల్లి,జూలై 08:( ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 1,659 చెక్ బౌన్స్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల తెలిపారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వంగర భవాని తో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల మాట్లాడుతూ చాలా మంది నిందితులు వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయనే భయంతో కోర్టుకు రావడానికి వెనుకాడుతున్నారని, అలాంటి వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల18న కక్షిదారులు తమ కేసు ఉన్న సంబంధిత కోర్టుకు హాజరైతే, వారెంట్లను రీకాల్ చేయడమే కాకుండా, కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తాం అని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం 1,659 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో 476 కేసుల్లో వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఒకేసారి మొత్తం డబ్బు చెల్లించలేని వారికి, ఫిర్యాదుదారులను సంప్రదించి వాయిదాల పద్ధతిలో చెల్లింపులు చేసేలా అవకాశం కల్పిస్తామన్నారు. బ్యాంకులు, చిట్ ఫండ్ సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి, ఆయా సంస్థల అధికారులతో మాట్లాడి వడ్డీ మినహాయింపు లేదా రాయితీలు ఇచ్చేలా కృషి చేస్తామని జిల్లా న్యాయమూర్తి వివరించారు. ఫిర్యాదుదారులు కూడా ఈ లోక్ అదాలత్‌కు హాజరై, పరస్పర చర్చల ద్వారా తమకు రావాల్సిన బకాయిలను తిరిగి పొందేలా అవగాహనకు రావాలని ఆమె కోరారు. కేసులకు సంబంధించిన వివరాలు లేదా ఇతర సందేహాల కోసం కోర్టు పని దినాల్లో ఎప్పుడైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం కక్షిదారులకు ఒక వరప్రసాదం వంటిదని, ఎటువంటి భయం లేకుండా కోర్టును ఆశ్రయించి సమస్యల నుంచి విముక్తి పొందాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చారు.

ప్రజా కలం

గురువారం, జూలై 9, 2026

## త్వరలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ, సెంటిమెంట్ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. శుభకార్యం ఏదైనా, పండగ ఏదైనా సెంటిమెంట్‌గా కొనే పసిడి.. కాలక్రమేణా ఇళ్లలోని లాకర్లలోనో, బ్యాంకు బీరువాల్లోనో నిరుపయోగంగా ఉండిపోతుంది. దేశ ఆర్థిక చిత్రం పరంగా చూస్తే, ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. భారతదేశం ప్రతి ఏటా వందల టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్ల భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళ్ళిపోతూ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పై ఒత్తిడి పెరుగుతోంది. మన దేశ సరిహద్దుల్లోనే ఇళ్లల్లో ఉన్న 30,000 టన్నుల బంగారంలో కేవలం 5 నుండి 10 శాతం భాగాన్ని చలామణిలోకి తీసుకురాగలిగినా.. రాబోయే ఐదేళ్లలో బంగారం దిగుమతులపై భారం సగానికి పైగా తగ్గుతుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి విలువను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడుతుంది. అంతర్జాతీయ మార్కెట్ నివేదికల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల గృహ వినియోగ బంగారం నిద్రాణంగా ఉంది. అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో.. ఈ భారీ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెరిగిపోతున్న పసిడి ధరలు దేశ దిగుమతి బిల్లుపై , రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో, పాత గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కు కీలక మార్పులు చేస్తూ కేంద్రం ఈ కొత్త సంస్కరణను తీసుకురాబోతోంది. ఈ పునరుద్ధరించిన కొత్త విధానాన్ని రాబోయే ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. నిజానికి, గతంలో 2015లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నాటి నుండి ఇప్పటివరకు దశాబ్ద కాలంలో కేవలం 39 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం ఈ పథకం కింద సేకరించగలిగింది. కఠినమైన బ్యాంకింగ్ నిబంధనలు, బంగారాన్ని కరిగించడానికి కస్టమర్లకు ఉండే సెంటిమెంట్ అడ్డంకులు, ప్యూరిటీ వెరిఫికేషన్ సెంటర్ల కొరత , అవగాహన లోపం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అందుకే ఈసారి సాంప్రదాయ బ్యాంకులపైనే కాకుండా, ఏకంగా జువెలర్స్ నే నేరుగా రంగంలోకి దించాలని కేంద్రం డిసైడ్ అయింది. ఈ కొత్త పాలసీలోని అత్యంత కీలకమైన మార్పు ఏంటంటే.. ఇకపై సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ బంగారాన్ని డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తాము క్రమం తప్పకుండా వెళ్లే, నమ్మకమైన స్థానిక జువెల వద్దకే నేరుగా వెళ్లవచ్చు. బంగారం వ్యాపారులే నేరుగా కస్టమర్ల నుంచి ఈ పసిడి డిపాజిట్లను సేకరించి, వాటిని ఒకచోట చేర్చే బాధ్యతను తీసుకుంటారు. తరతరాలుగా స్థానిక వ్యాపారులతో భారతీయ కుటుంబాలకు ఉండే సత్సంబంధాలను, నమ్మకాన్ని వాడుకోవడం ద్వారా ఈ స్కీమ్‌ను విజయవంతం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జువెలర్లను కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్లు గా గుర్తించడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను అధిగమించవచ్చు. ఈ సరికొత్త వ్యూహం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు జువెలర్లకు , సామాన్య వినియోగదారులకు ముగ్గురికీ లాభం చేకూరనుంది . దేశీయంగానే పాత బంగారం రీసైక్లింగ్ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల జువెలర్లకు విదేశాల నుంచి కొత్త బంగారాన్ని దిగుమతి చేసుకునే సోర్సింగ్ ఖర్చులు , ప్రీమియంలు భారీగా తగ్గుతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో బంగారం కొరత తగ్గుతుంది. మరోవైపు, ఇళ్లలో లాకర్లకే పరిమితమై ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని బంగారానికి ప్రభుత్వం బాండ్ల రూపంలో వార్షిక వడ్డీ కల్పిస్తుంది కాబట్టి, సామాన్య ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అదనపు ఆదాయ వనరుగా , సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత అంతే బరువు గల స్వచ్ఛమైన బంగారాన్ని లేదా నాటి మార్కెట్ ధర ప్రకారం నగదును పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. రాబోయే ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ సరికొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ పాత లోపాలను అధిగమించి ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది ఇప్పుడు వ్యాపార వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయకంగా గోల్డ్ లాకర్ సెంటిమెంట్ ను, ఆభరణాల రూపాన్ని మార్చడానికి ఇష్టపడని భారతీయ కుటుంబాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న లీగల్ గ్యారెంటీని, జువెలర్ల ద్వారా లభించబోయే సులువైన డిపాజిట్ ప్రక్రియను ఏ మేరకు అందిపుచ్చుకుంటాయో వేచి చూడాలి. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో విజయవంతమైతే.. భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త 'పసిడి వెలుగులు' రావడం ఖాయమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# వృద్ధురాలి దారుణ హత్య

### - క్లూస్ కోసం రంగంలోకి దిగిన సీపీ.. నిందితుల కోసం వేట ముమ్మరం



పెద్దపల్లి,జూలై 08:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని చంద్రబాబు కాలనీలో ఎల్లపుల రమణమ్మ (65) అనే వృద్ధురాలు తన నివాసంలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించడం స్థానికంగా తీవ్ర భయాందోళనలకు దారితీసింది. మృతురాలి మెడలోని గొలుసు,చెవికమ్మలు,సుమారు ఐదు తులాల బంగారు గాజులు అదృశ్యమైనట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు,ఆభరణాల కోసమే దుండగులు ఆమెను హత్య చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు విచారణను వేగవంతం చేయగా,రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు దర్యాప్తు పురోగతిపై ఏసీపీ ఎం. రమేష్,వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డిలతో సమీక్ష నిర్వహించిన సీపీ,ఘటనకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించాలని,స్థానిక సీసీ కెమెరాలను విశ్లేషించి అనుమానితుల కదలికలను గుర్తించాలని ఆదేశించారు.

నిందితులను త్వరితగతిన పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు పేర్కొన్న ఆయన,ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని స్థానికులను కోరారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి,నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు.

# సింగరేణికి తాడిచర్ల-2 కోల్ బ్లాక్ కేటాయింపు

### పెద్దపల్లిలో బీజేపీ సంబరాలు - పాలంపేట ఆలయానికి జాతీయ గుర్తింపు

పెద్దపల్లి,జూలై 08 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను ఎటువంటి వేలం ప్రక్రియ లేకుండా నేరుగా కేటాయించడం మరియు ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక శివాలయానికి భారత పురావస్తు శాఖ జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నంగా గుర్తింపు ఇవ్వడంపై బీజేపీ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పల్లె సదానందం మాట్లాడుతూ సింగరేణి సంస్థకు తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను నేరుగా కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని,దీనివల్ల సంస్థ మరింత బలోపేతం కావడమే కాకుండా పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ గనిలో సుమారు 182 నుంచి 434 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని,ఏటా 6 నుంచి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 40 నుంచి 50 సంవత్సరాల పాటు ఉత్పత్తి కొనసాగడంతో పాటు సుమారు12వందల నుంచి 3వేల వరకు ప్రత్యక్ష,పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, సింగరేణి సంస్థకు రూ. 64 వేల కోట్ల ఆదాయం మరియు తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో దాదాపు రూ. 16 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని ఆయన



వివరించారు. ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక శివాలయానికి జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నంగా హోదా కల్పించడం తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి గర్వకారణమని సదానందం అన్నారు. పురావస్తు చట్టం-1958 ప్రకారం ఈ గుర్తింపు లభించడం వల్ల ఆలయ పరిరక్షణ,సంరక్షణ మరియు అభివృద్ధి బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం నేరుగా చేపడుతుందని,యునెస్కో వారసత్వ సంపద రామప్ప దేవాలయంతో పాటు ఈ కట్టడానికి హోదా లభించడం కాకతీయుల వైభవాన్ని ప్రపంచానికి చాటుతుందని తెలిపారు. భారత సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రధాని మోదీకి,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూషణవేణి శ్రీనివాస్ గౌడ్,మోర మనోహర్, ప్రమోద్,కొమిరిశెట్టి రమేష్,కోల సుధాకర్,ముస్త్యాల సంతోష్,వేల్పుల లక్ష్మీనారాయణ,పెంద్యాల కుమార్, కననగొట్టు విజయ్,మొండుద్దుల జగన్, బండ కరుణాకర్,సోడా బాబు,మిట్టపల్లి వెంకటేష్,కొప్పుల శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలకు దిక్సూచి వైఎస్సార్

### ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు - ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



పెద్దపల్లి,జూలై 08:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి)

పేదవాడి కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా పాలన సాగించిన మహానేత వైఎస్సార్ అని,ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఉద్ఘాటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పెద్దపల్లి నియోజకవర్గంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన ప్రధాన వేడుకలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని,వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, వైఎస్సార్ పాలనా దక్షతను, ప్రజా సంక్షేమ దృక్పథాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో సామాన్యుడికి అందిన సంక్షేమ ఫలాలు నేటికీ చరిత్రలో నిలిచిపోయాయి. ఆరోగ్యశ్రీ,108 అంబులెన్స్,ఫీజు రీయింబర్స్‌మెంట్,ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపాయి. ఆయన దూరదృష్టితో నిర్మించిన మౌలిక వసతులు,భారీ ప్రాజెక్టులు నేటి అభివృద్ధికి పునాదులుగా నిలిచాయి అని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం,ఔటర్ రింగ్ రోడ్డు,కీలకమైన రహదారుల నిర్మాణం ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన వైఎస్సార్ కృషిని ఆయన గుర్తుచేశారు. ఆ గొప్ప నాయకుడి అడుగుజాడల్లో నడుస్తూ,పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు,పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,యూత్‌కాంగ్రెస్ ప్రతినిధుల పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

# మెట్‌పల్లి జీహెచ్‌ఎస్‌కు రూ.37 లక్షలతో అదనపు తరగతి గదులు

### - జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 8 (ప్రజా కలం) మెట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీహెచ్‌ఎస్)లో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 37 లక్షలతో పరిపాలనా అనుమతి మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత భవనం తొలగించబడిన నేపథ్యంలో ప్రస్తుతం పాఠశాలలో కేవలం రెండు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 160 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, 7 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోక విద్యార్థులు బోధనాభ్యాసంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రధానోపాధ్యాయులు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ విద్యా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ), కరీంనగర్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమర్పించిన అంచనా నివేదికను పరిశీలించిన అనంతరం జీఎస్టీ మినహాయించి రూ. 37



లక్షల వ్యయంతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పనుల నిర్వహణ కోసం జీఎస్టీ మినహాయించి రూ. 37 లక్షలను మెప్మా అందుబాటులో ఉన్న నిధుల నుంచి మెట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాకు విడుదల చేసి, నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మాకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.

# మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

### – ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు



సుల్తానాబాద్,జూలై 08;(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా,మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో శానిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం,1వ వార్డు సుగ్లాంపల్లిలో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ,15 వార్డులకు గాను 13 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినందుకు అభివృద్ధి బాధ్యత తనపై ఉందని,ఇచ్చిన మాట ప్రకారం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణంతో పాటు రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న శ్రీరాంపూర్ రోడ్డును ఆధునీకరించి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 1, 2, 13, 14, 15వార్డుల్లో పనులు ప్రారంభించామని,రాబోయే నాలుగు నెలల్లోనే ఈ పనులు పూర్తి చేస్తామని ఆయన వివరించారు. మహిళా ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,స్వయం సహాయక సంఘాల బలోపేతం మరియు మహిళలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన దిశగా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత,మున్సిపల్ కమిషనర్ టి. రమేష్,కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్,వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును వెంబడించి డ్రైవర్ పై దాడి




పెద్దపల్లి,జూలై 08 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణ పరిధిలో విధుల నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బస్సును వెంబడించి మరీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనపై పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం...ఆర్టీసీ డ్రైవర్ రేణిగుంట్ల శంకరయ్య బుధవారం పెద్దపల్లి నుంచి కరీంనగర్‌కు బస్సును నడుపుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో చీకురాయి గ్రామానికి చెందిన నాగవత్ వినయ్ కుమార్,రవి నాయక్ అనే వ్యక్తులు కారులో వస్తూ బస్సు ముందుకు వచ్చి అడ్డుతగిలారు. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ శంకరయ్య,అప్రమత్తంగా వ్యవహరించి కారును తప్పించుకుని బస్సును ముందుకు పోనిచ్చారు. అయితే, నిందితులు అంతటితో ఆగకుండా బస్సును వెంబడించారు. రంగంపల్లి కోర్టు చౌరస్తా వద్దకు రాగానే,బస్సుకు అడ్డంగా తమ కారును నిలిపి బస్సును నిలిపివేశారు. వెంటనే బస్సులోకి ప్రవేశించిన నిందితులు, డ్రైవర్ శంకరయ్యను బయటకు లాగి బూతులు తిడుతూ తీవ్రంగా దాడి చేశారు. తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా,తనపై దాడి చేశారని బాధితుడు శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పెద్దపల్లి పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



పెద్దపల్లి,జూలై 08 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి బయలుదేరిన క్రమంలో జరిగిన ప్రమాదంలో స్టాఫ్ నర్సు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి మండలం రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న కుక్క ధనలక్ష్మి (40), బుధవారం తన విధులు ముగించుకున్నారు. అనంతరం తన భర్త బోసెల్లి సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై చీకురాయి రోడ్డులోని తన నివాసానికి బయలుదేరారు. వారు పెద్దపల్లి పట్టణంలోని కమాన్ సమీపానికి చేరుకోగానే,వెనుక నుండి వేగంగా దూసుకొచ్చిన లారీ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధనలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె భర్త సురేష్‌కు ప్రస్తుతం ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి సోదరుడు కుక్క సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే ఆరోగ్య కార్యకర్త అకస్మాత్తుగా మృతి చెందడంతో రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది,కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పూర్తి పారదర్శకత

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఎల్-1 అర్హులకే గృహాల మంజూరు



పెద్దపల్లి,జూలై 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా,ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా ఎన్‌టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రామగుండం నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతోలి కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత విధానంలో ఎల్-1,ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా విభజించిందన్నారు.ఇంటి స్థలం ఉండి ఇందిరమ్మ గృహానికి అర్హులైన వారు ఎల్-1 జాబితాలో ఉంటారని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సిఫారసు చేసిన ఎల్-1 దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా గెజిటెడ్ అధికారులు పరిశీలిస్తారని,అర్హత నిర్ధారణ అనంతరం మున్సిపల్ కమిషనర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు చేరుతాయని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందిన తర్వాత మాత్రమే మంజూరు ఉత్తర్వులు జారీ అవుతాయని,మొత్తం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని స్పష్టం చేశారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎల్-1 జాబితాలోని 449 మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అయితే వారిలో కేవలం184 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారని తెలిపారు. ధర్మారం ప్రాంతంలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతుండగా, రామగుండం ప్రాంతంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు.మంజూరైన లబ్ధిదారులంతా వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు.నిబంధనల ప్రకారం ఇల్లు మంజూరైన45 రోజులలోపు నిర్మాణం ప్రారంభించకపోతే మంజూరును రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.అయితే రద్దు చేసే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులు లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని,అనంతరం కూడా నిర్మాణం ప్రారంభించకపోతే ఆ ఇళ్లను రద్దు చేసి ఇతర అర్హులైన వారికి కేటాయిస్తామని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా విడుదల అవుతున్నాయని,లబ్ధిదారులు నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే దానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.ధర్మారం ప్రాంతంలో మంజూరైన సుమారు 500 ఇళ్లలో కేవలం ఏడు మినహా మిగిలిన వారంతా నిర్మాణాలు ప్రారంభించారని,రామగుండం ప్రాంతంలో మాత్రం నిర్మాణ పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు.ఇటీవల ప్రజాప్రతినిధుల ద్వారా అందిన 1,312 మంది లబ్ధిదారుల జాబితాలో విచారణ అనంతరం 607 మంది ఎల్-1 కేటగిరీలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం వారి దరఖాస్తులు గెజిటెడ్ అధికారుల లాగిన్‌లో పరిశీలనలో ఉన్నాయని,వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.మరో 700 మంది ఎల్-2 కేటగిరీలో ఉన్నారని, వీరికి ప్రస్తుతం ఇంటి స్థలం లేదన్నారు.అయితే ఇంటి స్థలం ఉన్నట్లు సంబంధిత పత్రాలు సమర్పిస్తే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హత నిర్ధారించిన అనంతరం ఎల్-1 కేటగిరీకి మార్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని వివరించారు.ఎల్-3 కేటగిరీలో గతంలో ప్రభుత్వ గృహ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఉంటారని తెలిపారు.2014కు ముందు ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మాణం పూర్తికాని కుటుంబాలకు ప్రభుత్వం మరోసారి సహాయం అందించాలని నిర్ణయించిందన్నారు. బేస్‌మెంట్ స్థాయి వరకు మాత్రమే నిర్మాణం చేపట్టిన వారికి అక్కడి నుంచి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు.అర్హత ఉన్నప్పటికీ గతంలో దరఖాస్తు చేసుకోని కుటుంబాలు మున్సిపాలిటీలోని ప్రజాపాలన కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఆ దరఖాస్తులను హైదరాబాద్‌లో 360 డిగ్రీల పరిశీలన అనంతరం అర్హత నిర్ధారించి జిల్లాకు పంపిస్తారని, తర్వాత సాధారణ విధానంలో మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బేస్మెంట్ 600 చదరపు అడుగులకు మించరాదని,స్లాబ్ ఏరియా 750 ఫీట్ లకు మించి కట్టకూడదని,అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేపడితే కంప్యూటర్ ద్వారా బిల్లులు ఆమోదం పొందవని స్పష్టం చేశారు.మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే ఉండడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజాపాలనలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు తొలి ప్రాధాన్యతనిస్తూ గుడిసెలు లేని సమాజం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ట్రాన్స్‌జెండర్లు సహా వివిధ వర్గాలకు చెందిన సుమారు 500 కుటుంబాలకు ప్రభుత్వం భూ పట్టాలు ఇవ్వగా, వారిలో 27 మంది ఎల్-1 కింద,190 మంది గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారని,మరో 270 మంది ఇంకా దరఖాస్తు చేయలేదన్నారు.అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ ఎల్లయ్య,హౌసింగ్ పీడీ రాజేశ్వర్,తహసిల్దార్ రవీందర్ రావు,కార్పొరేటర్లు,స్థానిక ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మంచి పనులన్నిటినీ వ్యతిరేకించడం బీఆర్ఎస్ నైజం

## - ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 08

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించడం బీఆర్ఎస్ పార్టీ నైజం అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకత్వంపై పలు ఆరోపణలు చేశారు.తెలంగాణలో అభివృద్ధి జరిగితే, ప్రజలకు లాభం కలిగితే కల్వకుంట్ల కుటుంబ సభ్యులు విమర్శలు చేయడమే కాకుండా నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ లాభం పొందాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ నది ప్రక్షాళన, రైతులకు బోనస్ వంటి అనేక కార్యక్రమాలపై కూడా బీఆర్ఎస్ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినప్పటికీ బీఆర్ఎస్ నాయకులకు బాధే మిగిలిందని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణం, డిజైన్ మార్పులు అన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, అదే సమయంలో అది కుంగిపోయింది అని ఆయన ఆరోపించారు. ఎన్డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ ప్రాంతం భారీ బ్యారేజ్ నిర్మాణానికి అనుకూలం కాదని స్పష్టం అయిందని తెలిపారు. ప్రస్తుతం బలవంతంగా నీటిని నిల్వ చేస్తే 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వేలాది మంది ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ విధానం కానేకాదని ఆయన స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, పోచంపాడు, శ్రీశైలం వంటి ప్రాజెక్టులను నిపుణుల సూచనలతో కాంగ్రెస్ నిర్మించిందని గుర్తుచేశారు. మహారాష్ట్రతో 152 మీటర్ల ఒప్పందం చేసుకుని రాజ్‌భవన్‌లో వేడుకలు జరుపుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రధాని మోదీతో సాన్నిహిత్యం కూడా అదే పార్టీ పెంచుకుందని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ముంపు సమస్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. హరీష్ రావు రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని, పార్టీ భవిష్యత్తు మార్పులను దృష్టిలో ఉంచుకుని ఇతర పార్టీల వైపు చూస్తున్నారని ఘాటుగా విమర్శించారు. కేటీఆర్, హరీష్ రావు సిద్ధిపేట, సిరిసిల్లలను వదిలి తెలంగాణ లోని ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. బీఆర్ఎస్ వాదనలు సబబైతే కాళేశ్వరం నిర్వహణ బాధ్యతలను మూడు సంవత్సరాల పాటు ఆ పార్టీకి అప్పగించేందుకు కూడా ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి ప్రజల సమస్యలపై స్పందించాలని, దొంగ ఆరోపణలు మానేసి రాష్ట్ర ప్రయోజనాల కోసం ముందుకు రావాలని శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

## ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి- ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జూలై 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జిల్లా పంచాయతీ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా మంజూరు చేయాలని తెలిపారు. మండలాల వారీగా గృహాల నిర్మాణ పురోగతిని ఎంపీడీవోలతో సమీక్షించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి, ఇళ్ల నిర్మాణం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి సేంద్రియ ఎరువుల తయారీతో పాటు ఇతర ఆదాయ వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని, స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులపై నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రజలు, వ్యాపారుల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి వారం రెండు రోజుల పాటు డ్రై డే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గతంలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం నిర్వహించాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, ఇందుకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే ఫామ్ పాండ్ల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జలపాతంలో ఈతకు వెళ్ళి యువకుడు మృతి



వాజేడు, జూలై 08(ప్రజాకలం) ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో గల దూలపురం (లొద్ది) జలపాతంలో బుధవారం ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.జలపాతాన్ని సందర్శించేందుకు వచ్చిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడు సిద్దిపేట పట్టణానికి చెందిన యాద వైభవ్ (22)గా గుర్తించారు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట నుంచి యాద వైభవ్ తన స్నేహితులతో కలిసి ప్రకృతి అందాలను వీక్షించేందుకు, దూలపురం జలపాత సందర్శనకు వచ్చాడు. ఈ క్రమంలో జలపాతంలో ఈత కొట్టేందుకు నీటిలోకి దిగగా, లోతు ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారంఅందుకున్న వాజేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**లొద్ది జలపాతంలో నిషేధం ఉన్నా..! నిర్లక్ష్యం ఎవరిది..?**

**ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం.. పెడచెవిన పెడుతున్న పర్యాటకులు**

ప్రకృతి రమణీయతకు నిలయమైన దూలపురం (లొద్ది) జలపాతం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాద తీవ్రతను దృష్ట్యా అటవీశాఖ, పోలీస్ యంత్రాంగం ఈ జలపాతంలోకి దిగడాన్ని పూర్తిగా నిషేధించినట్లు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ పర్యాటకులు యథేచ్ఛగా లోపలికి ఎలా వెళ్తున్నారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద సరైన తనిఖీలు లేకపోవడం, జలపాతం వద్ద భద్రతా సిబ్బందిని లేదా గైడ్‌లను నియమించకపోవడం వల్లే పర్యాటకులు ఇష్టారాజ్యంగా నీటిలోకి దిగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరోవైపు పర్యాటకులు కూడా అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, సెల్ఫీల పిచ్చితో, అతి ఉత్సాహంతో ప్రమాదకరమైన లోయలు, మడుగుల్లోకి దిగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, దూలపురం జలపాతం వద్ద శాశ్వత ప్రాతిపదికన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి, గట్టి నిఘా ఉంచాలని, ఇలాంటి అకాల మరణాలు సంభవించకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి

## - ఆ మహానేతకు ఘన నివాళులు : డీసీసీ సంజీవ్ ముదిరాజ్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 08:

దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా నేడు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఏ. సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి చిత్రపటానికి డీసీసీ అధ్యక్షులు ఏ. సంజీవ్ ముదిరాజ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రైతులు, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ఆయన పాలనకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితా రెడ్డి,మీడియా సెల్ సీజే బెనార్.డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ జనరల్



సెక్రటరీ రాములు యాదవ్, దోమ పరమేశ్, హన్వాడ మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు గొనేల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, డీసీసీ కమిటీ సభ్యులు రమేష్ శెట్టి, పులిజాల రవికిరణ్, ఉషారాణి, సేవాదళ్ అబూకర్, వెంకట్ లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్, చందు యాదవ్,జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి హరీష్, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష

## బాలికలపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు తప్పవు : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,

నిర్మల్ జూలై 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

2022 సంవత్సరంలో కుబీర్ మండలం నిగ్వ గ్రామానికి చెందిన బనెల్లి విఠల్ అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన 09 ఏళ్ల బాలికకి చాక్లెట్ల ఆశ చూపి, ఆ బాలిక తో అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘోర ఘటనపై కుబీర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తరువాత, బుదువారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు – ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి శ్రీవాణి, నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.10,000/- జరిమానా విధించారు.

ఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ...సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని ఎస్పీ తెలిపారు.నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష లు పడేలా చేస్తారని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టటానికి నిర్మల్ పోలీసులు కృషి చేస్తున్నారు.. నిందితుడి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి, విచారణ అధికారులు సాయి కిరణ్,, ఎస్ఐ షరీఫ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీనివాస్, లైజెనింగ్ ఆఫీసర్స్ రమేష్ ఎస్ఐ,ప్రభాకర్ హెచ్. సి. ,లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ముధోల్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు



నిర్మల్ జూలై 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

మండల కేంద్రం ముధోల్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయంతిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రావుల గంగారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పేదలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. రైతు సంక్షేమానికి విశేష కృషి చేసిన రైతు బాంధవుడిగా ఆయన నిలిచారన్నారు. ఆయన హయాంలో ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, వార్డు సభ్యుడు అజీజ్, నాయకులు కిషన్ పాతంగే, గోవింద్ పటేల్, నగేష్, రాజు, లక్ష్మణ్, దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.

# మహానేత కు పాలాభిషేకం

## మాట తప్పని మడమ తిప్పని మరపురాని నేత డాక్టర్ వై.ఎస్.ఆర్ -పండా సిదార్థ దొర

## రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంలో ఘనంగా 77వ వై.ఎస్.ఆర్ జయంతి వేడుకలు

ప్రజాకలం ప్రతినిధి రంపచోడవరం నియోజకవర్గం, జులై 08:

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమం బుధవారం నాడు పండా సిద్ధార్థ దొర ఆధ్వర్యంలో నియోజకవర్గ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహముకు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి,ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా పండా సిదార్థ,గొల్లపల్లి శివబాబు మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ గతించి దశబ్దకాలం గడిచినప్పటికీ పేద ప్రజలకు చేసిన సేవలు మరుపు రానివని వాటిలో ముఖ్యంగా ఆరోగ్యశ్రీ తో పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఫీజు రీయంబర్స్మెంట్ తో విద్యార్థులకు చదువును, రైతులకు రుణమాఫీ ,ఉచిత విద్యుత్తు ను అందించి ఇలాంటి ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల యొక్క



మనసును గెలుచుకున్నటువంటి మహానేత అని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో రంపచోడవరం వైకాపా సీనియర్ నాయకులు కప్పల వెంకటరావు,నియోజకవర్గం సోషల్ మీడియా సభ్యులు రాపాక సుధీర్ రాజ్, రాష్ట్ర యువజన నాయకులు గొల్లపల్లి శివబాబు, నియోజకవర్గం యువజన నాయకులు డా. హేము,ఇర్ప శ్రీను,వినోద్,కోసు శ్రీను, కారం శేఖర్ బాబు, దివాకర్ తో పాటు పలువురు వైకాపా కార్యకర్తలు వై. ఎస్. ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# వైద్యుడి హత్యకు 15కోట్ల సుఫారి

– 1కోటి ఇవ్వండి అడ్వాన్స్ గా ఇస్తే వదిలేస్తాం

– డాక్టర్ ఫిర్యాదుతో ముగ్గురిని అరెస్ట్ చేసిన హనుమకొండ పోలీసులు




హనుమకొండ జులై 8 ప్రజా కలం ప్రతినిధి :

హనుమకొండలో ప్రముఖ వైద్యుడిని బెదిరించి రూ.15 కోట్లు వసూలు చేయాలని కుట్ర పన్నిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.సాంకేతిక ఆధారాలు,నిఘా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.గతంలో ప్రముఖ వైద్యుడి వద్ద డ్రైవర్‌గా పనిచేసిన యమగోని సుభాష్ గౌడ్,ఉద్యోగం కోల్పోయిన కక్షతో డాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పథకం వేశాడు. ఇందుకు తన స్నేహితులు శ్రీమూర్తి శ్రీనివాస్,బానోత్ రమేష్‌లను కలుపుకున్నాడు.డాక్టర్ కుటుంబం, కదలికలకు సంబంధించిన సమాచారంతో బానోత్ రమేష్ ఫోన్ చేసి,రూ.15 కోట్ల సుపారి వచ్చిందని, డబ్బులు ఇవ్వకపోతే హత్య చేస్తామని బెదిరించాడు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు కాల్ డేటా,సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించారు.మరోసారి ఆస్పత్రి వద్ద రెక్కీ నిర్వహించేందుకు వస్తుండగా ములుగు క్రాస్ రోడ్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్ తెలిపారు.

# రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

రోడ్డుపై బైఠాయించిన బిఆర్ఎస్వి నాయకులు



వాజేడు జూలై 8 (ప్రజాకలం)

మండల పరిధిలోని ధర్మవరం నుండి చెరుకూరు గ్రామం వరకు అస్తవ్యస్తంగా ఉన్నటువంటి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని బిఆర్ఎస్వి నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.రోడ్డు మార్గం పూర్తిగా గుంతల మయం కావడంతో ప్రయాణికులు,స్కూల్ బస్సుల విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఎటువంటి మరమ్మత్తులు చేయకుండా ఇసుక లారీలు తిరగడం వల్ల రోడ్డులో మరింతగుంతలు ఏర్పడి వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గతంలో పలు మార్లు ప్రమాదాలు జరిగిన కూడా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.ప్రభుత్వం తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తయ్యాకనే ఇసుక లారీలను నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి భద్రాచలం నియోజకవర్గం నాయకులు కీసర యువరాజ్ ధర్మవరం నాయకులు కీసర రాజు, తుండే సుధాకర్, బోల్లె శేష్ కుమార్, బలుసు పాటి ప్రశాంత్, గార రవికుమార్,నందు గౌతమ్ సీతారామరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని బంధువులను ఓదార్చిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు.



(వరంగల్ /పర్వతగిరి)జూలై 08, ప్రజాకలం ప్రతినిధి.వరంగల్ ఎంజీఎం మార్చురీలో బుధవారం రోజున ఇటీవల ఆశాలపల్లి సమీపంలోచెట్టు విరిగిపడి మృతిచెందిన వర్ధన్నపేట జోనల్ ట్రస్మా అధ్యక్షులు ఎర్రబెల్లి హరికుమార్ భౌతిక కాయాన్ని సందర్శనకు మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు మార్చురీకి వెళ్లారు. అనతికాలంలోనే హరికుమార్ మంచి పేరు తెచ్చారని రాములు అన్నారు. మార్చురీ లో మృతుని బంధువులను ఆయన ఓదార్చారు. ఆయన వెంట ప్యాక్స్ వైస్ చైర్మన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.
ఎర్రబెల్లి హరికుమార్ మరణం పట్ల సంతాపం తెలిపిన పర్వతగిరి మండల విద్యాశాఖ.

## భౌతిక దేహానికి నివాళులు అర్పించిన అధికారులు

(వరంగల్ /పర్వతగిరి) జూలై 08, ప్రజాకలం ప్రతినిధి.

బుధవారం పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఎ. బిక్షపతి, ఏనుగల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గాయపు లింగారెడ్డి, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె. నవీన్ కుమార్ పర్వతగిరి మండల కేంద్రంలోని విశ్వజెనిత్ ప్రవేట్ పాఠశాల కరస్పాండెంట్ ఎర్రబెల్లి హరికుమార్ గారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి మాట్లాడుతూ, ఎర్రబెల్లి హరికుమార్ సౌమ్యుడు, మృదుస్వభావి అని అన్నారు. విద్యారంగంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యక్తి అని వారి మరణం విద్యారంగానికి తీరని లోటు అని అన్నారు. ఈ విషాదం నుండి వారి కుటుంబం త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు, ఎమ్మార్సీ స్టాఫ్ గారె జయరాజ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# తాడిచర్ల నిరు పేద దంపతులకు గౌరవ డాక్టరేట్

- ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాలు

మల్హర్, జూలై 8 ప్రజాకలం ప్రతినిధి

మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు పులిగంటి సురేష్, కుంజ రుక్మిణిలు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఒకేసారి న్యాయశాస్త్రంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాలు సాధించి, గ్రామానికి అరుదైన విద్యా గౌరవాన్ని తీసుకువచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన దంపతులు ఒకేసారి న్యాయశాస్త్ర విభాగంలో ఈ అత్యున్నత మైలురాయిని అందుకోవడం విశేషం.సురేష్ న్యాయశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి పర్యవేక్షణలో “తెలంగాణ రాష్ట్రంలో వైవాహిక వివాదాల పరిష్కార స్థితి – హైదరాబాద్ జిల్లాను ప్రత్యేక ప్రస్తావనగా తీసుకున్న అధ్యయనం” అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. అలాగే కుంజ రుక్మిణి సహాయ ఆచార్యులు డాక్టర్ రాధికా యాదవ్ పర్యవేక్షణలో “తెలంగాణ రాష్ట్ర ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కుల పరిరక్షణ – భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ప్రత్యేక ప్రస్తావనగా తీసుకున్న అధ్యయనం” అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ప్రేమ వివాహం చేసుకున్న ఇ దంపతులు కొన్నేళ్లుగా తల్లి తండ్రులకు దూరమై ఇంత ఘనత సాధించారు. గ్రామ చరిత్రలోనే ఒకేసారి దంపతులు



డాక్టరేట్ పట్టాలు సాధించడం ఒక అరుదైన ఘట్టమని స్థానికులు, మేధావులు పేర్కొంటున్నారు. సమాజానికి ఉపయోగపడే చట్టపరమైన అంశాలపై విశ్లేషణాత్మక పరిశోధనలు చేసిన సురేష్ – రుక్మిణి దంపతులను ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఘనంగా అభినందించారు. వీరు భవిష్యత్తులో న్యాయరంగంలో మరిన్ని పరిశోధనలు చేస్తూ సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూలై 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టర్, నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లు నింపి, తిరిగి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలికరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇంటికి వెళ్లి, నింపిన ఫారములను తిరిగి తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సూపర్వైజర్లు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారములు నింపుతున్న తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉంటే, హెల్ప్ డెస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎటపాక మండలం తోటపల్లి లో ఘనంగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జులై 08:

మండల కేంద్రమైన తోటపల్లి సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఎటపాక వైఎస్ పార్టీ మండలం కమిటీ ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండలం అధ్యక్షులు ఆకుల వెంకట రామారావు, గుండాల యం పి టీ సీ గొంగడి వెంకట రామిరెడ్డి, మండలం కమిటీ నాయకులు హాజరై డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలం కమిటీ నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖంలో చెరగని చిరునవ్వు, నడకలో తెలుగుదనం ఉట్టి పడే రాజసం, పేదల గుండెల్లో ఎప్పటికీ జరగని జ్ఞాపకం మన అభివృద్ధి ప్రదాత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన చేసిన అభివృద్ధి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఆరోగ్యశ్రీ పథకం సృష్టికర్త డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు, గుండాల ఎంపిటిసి, గొంగడి వెంకటరామిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, చిచ్చడి రామారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, దామెర్ల రేవతి, మండల మహిళా అధ్యక్షురాలు, గుడిమల్ల నాగలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి ఆకులు దయాకర్, మండల యువజన విభాగం అధ్యక్షులు. తోట శశి కుమార్, ముత్తిపోయిన రాము, కాకాని సురేష్, మై సాక్షి రాకేష్, చల్ల



మణి, ధారా రమేష్, దుద్దుకూరు వెంకటేశ్వర్లు, అన్నెం జయచంద్రారెడ్డి, సారెడ్డి శ్రీనివాసరెడ్డి, భోగాల వీరారెడ్డి, బోరం ప్రభాకర్, చిలుకూరు నాగయ్య, గద్దల రమణయ్య, గోడపర్తి నాగయ్య, సోడే ప్రసాద్, గజ్జల శ్రీనివాస్, అప్పల రెడ్డి, నాగేశ్వరరావు, భూక్య సుక్కు నాయక్, మేడిపల్లి సాంబయ్య, ఎస్ రామారావు, కే శేషగిరిరావు, బి సూరిబాబు , పి వీరయ్య , మాణికల బాలకృష్ణ యాదవ్, మేడేపల్లి శీను, పేరాల మోహన్రావు, బుర్ర రాంబాబు, పునుగుపాటి వెంకటనారాయణ, ఎన్నా పెద్ద పండు , వరపర్ల చంటి, గోళ్ళ నరేష్, రాచకొండ నరసింహారావు,వై ఎస్ ఆర్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా కొడుకు నుండి నాకు రక్షణ కల్పించండి

- ఓ మాతృమూర్తి ఆవేదన..! - అధికారులు తనకు రక్షణ కల్పించాలని వేడుకోలు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జులై 08 :

– ఇటీవల తన మన అనే భేదం లేకుండా వరుస అఘాయిత్యాలు జరుగుతున్న వేళ నా చిన్న కొడుకు నుండి నాకు ప్రాణభయం ఉంది అధికారులు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ మాతృమూర్తి బుధవారం నాడు మీడియాను ఆశ్రయించింది. వివరాల్లోకెళితే ఎటపాక మండల కేంద్రానికి చెందిన రాయిని హైమావతి అనే 70 సంవత్సరాల వృద్ధురాలు తనకు తన చిన్న కుమారుడు రాయిని రమణ నుండి ప్రాణహాని ఉందని ఈ విషయమై అధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పత్రికాముఖంగా వేడుకున్నారు. తన చిన్న కుమారుడు ఇంటిని అమ్ముకోగా , గతంలో తను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిలో తన చిన్న కుమారుడి కుటుంబానికి మానవత్వంతో ఆశ్రయం ఇచ్చానని , నేడు తనను సొంత ఇంటిలో ఉండనివ్వకుండా తన చిన్న కుమారుడు , కోడలు కలిసి ఇంటిని ఆక్రమించుకొని దుర్భాషలాడుతూ



నిర్దాక్షిణ్యంగా తనను గెంటి వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని , అదేమిటని ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ చేసి తనకు తగిన న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

# పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ మండల నాయకులు

(వరంగల్ /పర్వతగిరి)జూలై 08, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన విశ్వజెనిత్ పాఠశాల కరస్పాండెంట్ ఎర్రబెల్లి హరికుమార్ ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మ మీద పడి ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్సపొందుతు మంగళవారం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన మాజీ



జెడ్పిటిసి సుధాకర్ శైలజ తల్లి మదాసి ఉప్పలమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దాసరి రవీందర్ బుధవారం మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచిన ఫ్యాక్స్ చైర్మన్ యం.మనోజ్ గౌడ్, బీ. ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు. ఈ కార్యక్రమంలో ఏయంసీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగేందర్ రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్, కొంకపాక సర్పంచ్ రాయబారపు రమాదేవి, మాజీ ఎంపీటీసీ కరిమిళ్ళ మోహన్ రావు, మండల నాయకులు జెంగిలి బాబు, బొట్ల మధు, దొమ్మటి రాజు, కొప్పు రాజు, చిన్నపాక శ్రీకాంత్, యాసరపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాలఆధ్వర్యంలో అమలవుతున్న ప్రగతి/పి.ఎం.జి ప్రాజెక్టుల అంశాలపై విస్తృత చర్చ

– భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శి (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 08:

కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రగతి/పి.ఎం.జి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శి (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్ అధ్యక్షతన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న నీటిపారుదల, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంపు కార్యాలయం తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశంపై ఆమె వివరాలు వెల్లడించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియను ఒక నెల రోజుల్లో పూర్తి చేసి, ప్రాజెక్టు పనులు వేగవంతంగా ముందుకు సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్.డి. ఓ నవీన్ ,తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న చరిత్రకు అధికారిక గుర్తింపు పరిశోధకులకు ఘనంగా సన్మానం

– రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 08:

బుధవారం హైదరాబాద్ లోని మసాబ్ ట్యాంక్ లోని దామోదరం సంజీవయ్య భవనంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పండుగ సాయన్న చరిత్రకు అధికారిక గుర్తింపు దిశగాచరిత్రను వెలికితీసిన పరిశోధకులకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఘన సన్మానం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్న జీవిత చరిత్రను వెలుగులోకి తీసుకురావడంలో విశేష కృషి చేసిన బెక్కం జనార్ధన్, సీనియర్ జర్నలిస్టు మెట్టుకాడి ప్రభాకర్, పండుగ సాయన్న



సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, ‘పాలమూరు ప్రజా వీరులు’ రచయిత డా. ఇందిరాదేవి, కవి బోల యాదయ్యలను రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఘనంగా సన్మానించారు.
చరిత్రలో మరుగునపడిన బడుగు, బహుజన వీరుల చరిత్రను వెలికితీయడం సమాజానికి గొప్ప సేవ అని అన్నారు. దొరల పెత్తందారీ వ్యవస్థ, రజాకారుల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుల చరిత్రను రచయితలు, పరిశోధకులు ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా పాలమూరు ప్రాంతానికి చెందిన రచయితలు, పరిశోధకులు ఈ దిశగా ముందుండడం గర్వకారణమని అన్నారు. పండుగ సాయన్న జననం, మరణం తేదీలను అధికారికంగా ధ్రువీకరించేందుకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలువురు వక్తలు చారిత్రక పత్రాలు, ప్రభుత్వ రికార్డులు మరియు అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సమగ్రంగా పరిశీలించి అధికారిక తేదీలను ప్రకటించాలని కోరారు. రాబోయే సమావేశంలో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బండ ప్రకాశ్, వాకిటి శ్రీహరి, ఈటెల రాజేందర్, పండుగ సాయన్నపై రచనలు చేసిన బెక్కం జనార్ధన్, మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, డా. ఇందిరాదేవితో పాటు ఇతర ముఖ్య నాయకులు, పరిశోధకులతో చర్చించి, చారిత్రక ఆధారాల మేరకు తుది నిర్ణయం తీసుకుని పండుగ సాయన్న జనన, మరణ తేదీలను అధికారికంగా ప్రకటిస్తామని బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వెల్లడించారు.

# నేడు (జూలై 9 న) జరిగే రైతు మేళా కు సర్వం సిద్ధం

**స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్దతులపై అవగాహన ప్రదర్శనలు - చింతకాని మండలంలో నిర్వహించే రైతు మేళా ను రైతులు వినియోగించుకోవాలి**
**నూతన వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక స్టాళ్లు - జూన్ 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**
**చింతకాని మండలం జగన్నాథపురం వద్ద రైతు మేళా స్టాల్స్, స్టేజి, భోజనం వసతులు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ఖమ్మం, జూలై 08( ప్రజా కలం న్యూస్ )

చింతకాని మండలం జగన్నాథపురం (మత్కెపల్లి క్రాస్ రోడ్) వద్ద జూలై 9న నిర్వహించే రైతు మేళా కు సర్వం సిద్దం చేశామని, స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్దతుల ప్రదర్శనలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపు నిచ్చారు.

జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరాయన్నారు. కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్, రైతు మేళా స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రజల రాకపోకల మార్గాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, విద్యుత్, సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి అంశం సమయానికి పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రైతులకు విజ్ఞానం, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఒకే వేదికపై పరిచయం చేయాలనే లక్ష్యంతో రైతు మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖ, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

రైతులు కేవలం ప్రదర్శనలు మాత్రమే కాకుండా ఆధునిక వ్యవసాయ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నామని, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ, విలువ ఆధారిత వ్యవసాయంపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాతో పాటు పరిసర రైతులు, ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై కొత్త సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రైతుల ఆదాయం పెంచే ఆధునిక వ్యవసాయ విధానాలను తెలుసుకునేందుకు ఈ మేళా చక్కని అవకాశమని చెప్పారు.

రైతు మేళాకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతులు, వైద్య శిబిరాలు, సహాయ కేంద్రాలు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాదిగా రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాలు, అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేసేలా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.అనంతరం ముఖ్యమంత్రి సభకు వచ్చే వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ట్రాఫిక్ రూట్ మ్యాప్‌లను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఏర్పాటును నాణ్యతతో, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీల కు సంబంధించిన సమస్యలను సత్వరం పరిష్కరించాలి

## - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 08:

ఎస్సీ, ఎస్టీ కు సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డి.వి. ఎం.సి) సమావేశం నిర్వహించారు.సమావేశం ప్రారంభంలో గత డీవీఎంసీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు, వాటిపై చేపట్టిన చర్యలను సమీక్షించారు. అనంతరం కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీల భూ ఆక్రమణలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, మత్స్యకార సంఘాల్లో సభ్యత్వం, రైతుబంధు, పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలలో సబ్సిడీలు, ఆర్థిక సహాయం అందకపోవడం, హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలను జిల్లా పరిపాలనతో పాటు పోలీసు శాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు., ప్రతి అంశాన్ని సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.డి.వి. ఎం.సి సమావేశాలను ప్రతి నెలా నిర్వహించడం వెనుక ఉద్దేశ్యం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చిన్నచిన్న సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించడమేనని కలెక్టర్ పేర్కొన్నారు. కమిటీ సభ్యులు నిర్దిష్ట కేసుల వివరాలను అందిస్తే వాటిపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆరోగ్యం, ఆహారం, విద్యా సౌకర్యాలు, మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. సీట్ల కొరత, మౌలిక వసతుల లోపం వంటి సమస్యలను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు అవసరమైన అదనపు సదుపాయాలు మంజూరు చేయాలని



కోరినట్లు వెల్లడించారు. ప్రజావాణిలో కూడా హాస్టల్ సీట్ల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అదేవిధంగా, కమిటీ సభ్యుల సూచన మేరకు సమావేశ మినిట్స్‌ను సమావేశానికి మూడు రోజుల ముందుగానే సిద్ధం చేసి సభ్యులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అలాగే తదుపరి సమావేశానికి ముందు గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిపై సమగ్ర నివేదికను సభ్యులకు అందజేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకి, ఆర్డీవో నవీన్, షెడ్యూల్డ్ కులాలఅభివృద్ధి అధికారి సునీత, డి.వి.ఎం.సి సభ్యులు కె లక్ష్మన్, బాలయ్య, చంద్రశేఖర్,మోహన్ లాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కుల విషయంలో కాంగ్రెస్ వైఖరి సరైనది కాదు

**- గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించడం మానుకోవాలి - మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ - తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం అందించిన సేవలు మరువలేనివి**



మరిపెడ ప్రజాకలం న్యూస్ జూలై 8

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఓట్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు గిరిజనుల అభ్యున్నతిని విస్మరించి రాజకీయ ప్రయోజనాలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఓట్లతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, కానీ అదే గిరిజనుల సమస్యలు, హక్కులు, అభివృద్ధి విషయానికి వస్తే పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ గిరిజనుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేయలేదని విమర్శించారు. గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే వాటిని కాలరాస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గత ఐదు దశాబ్దాలుగా లంబాడీ గిరిజనులను చిన్నచూపు చూస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. గిరిజనుల అభివృద్ధికి అవసరమైన విద్య, ఉపాధి, ఆరోగ్యం, భూమి హక్కులు, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టకుండా కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వారిని గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఈ అన్యాయాన్ని చూస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మౌనంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గిరిజన యువత, విద్యార్థులు ఎంతో త్యాగం చేశారని, ఆ పోరాట స్ఫూర్తితోనే నేడు అధికారంలో ఉన్న నాయకులు ఎదిగారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల సమస్యలను పక్కన పెట్టి వారినే విభజించే రాజకీయాలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భాషల పేరుతో, గిరిజన తెగల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. గిరిజన సమాజంలో ఐక్యత దెబ్బతినేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఒక తెగను మరో తెగకు వ్యతిరేకంగా నిలబెట్టి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే చిచ్చు పెట్టే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గిరిజన జనాభా అత్యధికంగా ఉందని అందరికీ తెలిసిన విషయమేనని, అయినప్పటికీ ఆ ప్రాంత అభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యా అవకాశాలు, వైద్య సేవలు, ఉపాధి కల్పన, రహదారులు, సాగునీటి సౌకర్యాలు, తాగునీటి సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడం, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం, విద్యాభివృద్ధి కోసం అనేక కేంద్ర విద్యాలయాలు మంజూరు చేయడం, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ నిధులు కేటాయించడం వంటి అనేక కార్యక్రమాలు బీజేపీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా ఉపయోగించుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలతో కాలం గడుపుతున్నాయని, దీనివల్ల రాష్ట్ర అభివృద్ధి దెబ్బతింటోందని అన్నారు. సంచార జీవనం సాగించిన అనేక గిరిజన తెగలకు 20వ శతాబ్దం వరకు స్థిర నివాసాలు కూడా లేవని గుర్తు చేశారు. అలాంటి వెనుకబడిన సమాజాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రస్తుతం వారిలోనే విభేదాలు సృష్టించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. గిరిజనుల సంక్షేమానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే వారి విద్య, ఉపాధి, ఆరోగ్యం, భూమి హక్కులు, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్లు తెరిచి గిరిజన తెగల మధ్య విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలకు స్వస్తి చెప్పాలని, అన్ని గిరిజన తెగలను సమాన దృష్టితో చూస్తూ వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజలే తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. గతంలో ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా బీఆర్ఎస్ పార్టీకి ఎదురైన పరిస్థితులే కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఎదురవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తారని మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు యూనిఫామ్ పంపిణీ

## -సర్పంచ్ శంకుతలమ్మ భీమన్న

ప్రజా కలం న్యూస్ (గద్వాల ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం



వెంకటపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు యూనిఫామ్ సర్పంచ్ శంకుంతలమ్మ భీమన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పిల్లలకు విద్యాభ్యాసంతో పాటు సమానత్వ భావం పెంపొందించేందుకు యూనిఫామ్ పంపిణీ చాలా ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు అంగన్వాడీకి పంపించాలని, పిల్లల ఆరోగ్యం, పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.అదేవిధంగా టీచర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం, పోషణ విషయంలో మంచి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన సదస్సు

**నూతన కమిటీ ప్రమాణ స్వీకారం పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు**



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం,జులై 08: అక్షయ ఫంక్షన్ హాల్ నందు టీ యూ డబ్ల్యూ జే (ఐ జే యూ )ఆధ్వర్యంలో "సమాజంపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు , తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి రాంనారాయణ హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సోషల్ మీడియాను సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే తప్పుడు ప్రచారాలను అరికట్టడంలో పాత్రికేయులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సెమినార్ అనంతరం నూతనంగా ఎంపికైన టీ యూ డబ్ల్యూ జే (ఐ జే యూ )భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు నియోజకవర్గం, మండల కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా జాగు వెంకటరత్నం, కార్యదర్శిగా జునుముల రమేష్, కోశాధికారిగా సీమకుర్తి శ్రీనివాసరావు, భద్రాచలం మండల మీడియా అధ్యక్షులుగా రాజాకిరణ్, కార్యదర్శిగా శివతో పాటు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు ని, పాయం వెంకటేశ్వర్లు ని శాలువాతో సత్కరించారు...నూతన కమిటీ సభ్యులకు ముఖ్య అతిథులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు నిష్పక్షపాత వార్తలను అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

# ఇదేం పద్ధతి.. ఖబర్దార్

**మాటతిరు మారామి అనుచిత వాక్యలు వెనక్కి తీసుకోవాలి**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై నిరాధార ఆరోపణలు మానుకోవాలి**
**రంగారెడ్డి జిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వంశీ గౌడ్**

( షాద్నగర్ జులై 08 ప్రజా కలం ప్రతినిధి )

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన పద్ధతి తీరు మార్చుకోవాలని రంగారెడ్డి జిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెండ్లిమడుగుల వంశీ గౌడ్ హితవు పలికారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు ఉన్నా వాటిని ప్రజల ముందుకు తీసుకురావాలని లేకపోతే వెంటనే అవంచిత వాక్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా ప్రజాప్రతినిది పై ఆరోపణలు చేయడం మంచిది కాదు అని అన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడు, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ సమస్య ప్రభుత్వం దృష్టికి ఎన్నో సార్లు తీసుకెళ్లి పరిస్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న నాయకుడిపై అసత్య ప్రచారం చేయడం సబబు కాదన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం బాధ్యతాయుతమైన నాయకులకు తగదని పెండ్లిమడుగుల వంశీ గౌడ్ అన్నారు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని రంగారెడ్డి జిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెండ్లిమడుగుల వంశీ గౌడ్ డిమాండ్ చేశారు

## వినాయక హిల్స్ ఫేజ్--2లో భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించినఏఐసీసీ- విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



మహేశ్వరం, జులై 08,(ప్రజా కలం)

అల్మాస్‌గూడలోని వినాయక హిల్స్ ఫేజ్--2, రోడ్డు నెం.18 & 19లలో ప్రారంభమైన భూగర్భ డ్రైనేజీ పనులను ఏఐసీసీ- విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, వేగవంతంగా పూర్తి చేసి స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

# ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

- జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గా
- కుమ్మరి నరేష్ ఎగిరిశెట్టి ఎన్నిక
- రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్

మహేశ్వరం, జులై 08, (ప్రజా కలం)

జిల్లా ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్ ఎగిరిశెట్టి అన్నారు. జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గా కుమ్మరి నరేష్ ఎగిరిశెట్టి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఉప సర్పంచ్ల సమస్యలను పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఉపసర్పంచ్ల ఫోరం రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఆంగోత్ భాస్కర్ నాయక్ రామచంద్ర గూడెం ఉపసర్పంచ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

వర్కింగ్ ప్రెసిడెంట్ గా కుమ్మరి నరేష్, ఉపాధ్యక్షులుగా జి బాలరాజు, ప్రభాకర్, యాదగిరి రెడ్డి , లాల్ సింగ్ ను ప్రధాన కార్యదర్శిగా ముక్కు పోగుల ప్రకాష్ గౌడ్, గౌరవ అధ్యక్షులు ఆర్ శివకుమార్ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు మల్కయ్య, గోవర్ధన్ రెడ్డి శంషాబాద్ మండల కమిటీ అధ్యక్షులు నందు, మహేశ్వరం మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షులు శివకుమార్, కొత్తూరు మండల అధ్యక్షులు ఆరోగ్యం, కర్తాల్ మండల అధ్యక్షులు లక్పతి నాయక్, ఆమనగల్ మండల అధ్యక్షులు కుమార్, తలకొండపల్లి మండల అధ్యక్షులు భాస్కర్ నాయక్, యాచారం మండల అధ్యక్షులు అనిల్ కుమార్,మంచాల మండల అధ్యక్షులు యాదగిరి గౌడ్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.



# లక్షల కోట్లు ఖర్చు- చుక్కనీరు ఇవ్వలేని దుస్థితి

## కాళేశ్వరం వద్ద కొనసాగుతున్న మట్టి నమూనా పరీక్షలు

## 2020లోనే బ్యారేజీల వద్ద లికేజీలను గుర్తించారు

## భూగర్భ పరీక్షలకు చేయకుండా నిర్మాణం

## లక్ష్మారెడ్డి మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న కె ఎల్ ఆర్ ఇండస్ట్రీస్

మహేశ్వరం, జులై 08,(ప్రజా కలం)

భూగర్భ పరీక్షలు చేయకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపట్టారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.కె ఎల్ ఆర్ ఇండస్ట్రీస్ తరపున



మట్టి నమూనా పరీక్షలు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. పిల్లర్లు కుంగటానికి ప్రధాన కారణం మట్టి నమూనా పరీక్షలు చేయకుండా నిర్మాణాలు చేపట్టడమేనని అన్నారు. 2020లోనే 2 లికేజీలు గుర్తించినట్లు అధికారులు తెలిపారని కె ఎల్ ఆర్ అన్నారు. నిన్న సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాలను ప్రజలకు వివరించారని లక్ష్మారెడ్డి తెలిపారు. లక్షల కోట్లు వృథా అయినా చుక్కనీరు అన్నదాతలకు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని కిచ్చెన్నగారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యారేజీ వద్ద 15 -- 30 మీటర్ల లోతుగా మట్టి నమూనా పరీక్షలు చేయాల్సి ఉన్నా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా బ్యారేజీలను నిర్మించిందని కిచ్చెన్న తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల విషయంలో శాస్త్రీయ నివేదిక, జియో టెక్నికల్, ఎన్ డి ఎస్ ఏ నిబంధనలు పాటించకపోవటం వల్లే బ్యారేజీలు దెబ్బతిన్నాయని తెలిపారు. గత పాలకులు సరైన ప్రమాణాలు పాటించకపోవటం వల్ల నేటి ప్రభుత్వం అదనపు భారం పడుతుందని కె ఎల్ ఆర్ అన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే ఉద్యమ బాట.

## పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్.

దుబ్బాక ప్రజాకలం జులై 08.

రాయపోలు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయ ఉద్యోగులకు ఆరు నెలల్లోపు పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నప్పటికీ, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేసి, సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల నుంచి హెల్త్ ప్రీమియం నెలనెలా కోత విధిస్తున్నప్పటికీ, ఆరోగ్య కార్డులపై మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం దురదృష్టకరమన్నారు. 2003 ఎన్నికల ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను నిర్దిష్ట గడువులోగా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆదరాసుపల్లి శశిధర్ హెచ్చరించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాయపోలు మండల శాఖ అధ్యక్షుడు దుంబాల ఇంద్రసేనారెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి లచ్చు గారి కనకారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్బల్, సీనియర్ నాయకులు గుర్రం నాగరాజు, ఎం. నాగరాజు, బొల్లం సంపత్, భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# యాసంగి బియ్యం కోటా పెంచాలి

## బియ్యం సేకరణపై కేంద్రానికి ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి వినతి..

పటాన్‌చెరు,జులై 8 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి నమోదైన నేపథ్యంలో యాసంగి బియ్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని ఎమ్మెల్సీ డా.చిన్నమైల్ అంజిరెడ్డి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, ప్రహ్లాద్ జోషిని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది



వానాకాలం,యాసంగి సీజన్లలో కలిపి దాదాపు 152 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి నమోదైందని, ప్రస్తుతం కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకే అనుమతి ఇవ్వడంతో నిల్వ,మిల్లింగ్ రవాణా,కార్మికుల సమస్యలు పెరిగి రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని వివరించారు.

తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారత ఆహార సంస్థ ద్వారా బియ్యం సేకరణ లక్ష్యాన్ని వెంటనే పెంచాలని కోరారు. కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించి రైతాంగానికి అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు డా. చిన్నమైల్ అంజిరెడ్డి తెలిపారు..

# నేడే సంగారెడ్డిలో టీయూడబ్ల్యూజే జర్నలిస్టుల మహాసభ!

## -జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాటం.

## -ముఖ్య అతిథిగా హాజరవుతున్న మంత్రి రాజనర్సింహ పాల్గొంటున్న పలువురు ప్రముఖులు.

సంగారెడ్డి ప్రతినిధి జులై 08(ప్రజా కలం):

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను గురువారం భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్, జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి , జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో పాటు ఎంపీలు రఘునందన్ రావు సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో పాటు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సమావేశానికి హాజరవుతున్నట్లు వివరించారు.

రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావ్ నారాయణ కూడా పాల్గొంటున్నారని చెప్పారు.

ప్రతి జర్నలిస్టు సంక్షేమమే లక్ష్యంగా ఈ మహాసభను జరుపుతున్నట్లు వారు తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని, సంగారెడ్డి జర్నలిస్టులు పోరాట యోధులని అన్నారు. గతంలో జర్నలిస్టులైన ఇబ్బంది పెట్టిన వారిపై నిరంతరం పోరాటం చేశామని చెప్పారు.అదే సమయంలో ప్రతి జర్నలిస్టు సంక్షేమానికి తమ సంఘం పాటుపడిందని వెల్లడించారు.

జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా రాలేదని, హెల్త్ కార్డు సమస్య ఇంకా పెండింగ్ లోనే ఉందని చెప్పారు. ఉద్యోగ భద్రత కూడా లేకుండా పోయిందని అన్నారు. వీటన్నిటిపై తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల వక్షాన అలుపెరుగకుండా పోరాడుతున్నామని వివరించారు. గతంలో తమ యూనియన్ పోరాట ఫలితంగానే గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు వచ్చాయని, బస్సు పాసులు అందాయని, ఇంటి స్థలాలు కూడా చాలామందికి ఇప్పటికే వచ్చాయని పేర్కొన్నారు.మిగిలిన వాళ్లకు కూడా సంక్షేమ ఫలాలు అందాలంటే యూనియన్ ను మరింత బలోపేతం చేయాల్సి ఉన్నదని చెప్పారు. ఐక్య పోరాటాలు మాత్రమే శరణ్యం అని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేశామని ప్రకటించారు. జిల్లాలోని పాత్రికేయుల సమస్య పరిష్కారమే తమ యూనియన్ లక్ష్యం అని వెల్లడించారు. అంతేకాకుండా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు,కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు ,వీడియో గ్రాఫర్లు దశాబ్దాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. వారందరికీ ఈ మహాసభ ద్వారా భరోసా కల్పించనున్నట్లు చెప్పారు.

అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, హెల్త్ కార్డు, అక్రిడేషన్ కార్డులను సాధించడం జరుగుతుందన్నారు. మహాసభ నిర్వహణకు ఆహ్వాన కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ఖచ్చితంగా సమావేశం ప్రారంభం అవుతుందని అన్నారు.

అన్ని మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు తరలి రావాలని కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో సమన్వయం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అన్ని విభాగాల జర్నలిస్టుల ఐక్యతకు పాటుపడుతూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు.





# జాతీయ పత్తి సాగు మిషన్, ఆత్మనిర్భర్ భారత్ మిషన్ కింద సబ్సిడీ విత్తనాల పంపిణీ.

దుబ్బాక ప్రజాకలం జులై 08.

రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ పత్తి సాగు మిషన్, ఆత్మనిర్భర్ భారత్ మిషన్ కింద రైతులకు 100 శాతం సబ్సిడీపై పత్తి విత్తనాలు, 50 శాతం సబ్సిడీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దౌల్తాబాద్ -- రాయపోల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, రాయపోల్ సర్పంచ్ రాజు సంయుక్తంగా రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి, లేదా సింగిల్ పిక్ కాటన్ విధానం ద్వారా తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా సాధారణ సాగుతో పోలిస్తే ఎకరాకు 30 నుంచి 40 శాతం వరకు అదనపు దిగుబడి, దాదాపు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. వర్షాధార తేలికపాటి నేలలు, చల్కా నేలలు, ఎర్ర నేలలకు ఈ పద్ధతి అనుకూలమని, ఎకరానికి 3 నుంచి 5 కిలోల విత్తనాలు సరిపోతాయని తెలిపారు. వరుసల మధ్య 90 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్ల దూరం పాటించడం ద్వారా ఎకరానికి 22 వేల నుంచి 26 వేల మొక్కలు పెంచుకోవచ్చని సూచించారు. కలుపు నివారణ కోసం విత్తనం వేసిన 24 నుంచి 48 గంటల లోపు ఎకరానికి 1.2 లీటర్ల పెండిమిథాలిన్ 30 శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొక్కల ఎదుగుదలను నియంత్రించేందుకు మెపిక్వాట్ క్లోరైడ్ ను అవసరాన్ని బట్టి ఒకటి లేదా రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ పద్ధతిలో పత్తి పంట కేవలం 150 రోజుల్లోనే పూర్తవుతుందని, ఒకేసారి కోతకు రావడం వల్ల కూలీల ఖర్చు తగ్గి రైతులకు అదనపు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ తర్వాత నీటి వసతి ఉన్న రైతులు రెండో పంటగా వేరుశనగ, మొక్కజొన్న లేదా ఇతర ఆరుతడి పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఆత్మనిర్భర్ భారత్ మిషన్ కింద రైతులకు 50 శాతం సబ్సిడీపై కంది విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆర్.నరేష్, ఏఈఓలు రజిత, శిరీష, మాధవి, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బిస్లరీ పరిశ్రమ కార్మికులను అక్రమ తొలగింపులపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి కి విన్నవించిన సిఐటియు నాయకులు..

**- సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో సమస్యను పరిష్కరించాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు..**

**- కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న బిస్లరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

**- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్**

సంగారెడ్డి ప్రతినిధి జులై 08( ప్రజా కలం):

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి కి హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో సిఐటియు నాయకత్వ బృందం సిఐటియు రాష్ట్ర ఉ



పాధ్యక్షులు జే మల్లికార్జున్ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం జిల్లా ఉధ్యక్షులు అతిమేల మానిక్ జిల్లా కార్యదర్శి జి సాయిలు కలిసి వినతిపత్రం అందజేశారు.. సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ గారు రాష్ట్ర లేబర్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ కు ఫోన్ చేసి బిస్లరి కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ బిస్లరి ఇంటర్నేషనల్ యాజమాన్యం చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. యూనియన్ పెట్టుకుంటే తొలగిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమల్లోకి రాకముందే యాజమాన్యాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయి అని అన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి కార్మిక శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు .ఈ కార్యక్రమంలో బిస్లరీ యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి ఉపాధ్యక్షులు ప్రవీణ్ గౌడ్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు రాజశేఖర్ రెడ్డి

**అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్క్ వద్ద డా వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు**

**ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి**

మహేశ్వరం, జులై 08,(ప్రజా కలం)

ప్రజా సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రజానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్క్ వద్ద ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైఎస్ఆర్ అభిమానులు, స్థానిక ప్రజలు,బడి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కూడా ఎంతో ఆనందంగా పాల్గొని వైఎస్ఆర్ గారికి జయంతి శుభాకాంక్షలు తెలియజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా లిబోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి రైతు, పేద, విద్యార్థి, మహిళ, వృద్ధుడు అనే తేడా లేకుండా ప్రతి వర్గం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చిరస్మరణీయమైన సేవలు అందించిన మహానేత అని అన్నారు. ఆయన మన మధ్య లేక 16 సంవత్సరాలు గడిచినా, నేటికీ ప్రజల గుండెల్లో సజీవంగా నిలిచి ఉండటం ఆయన అందించిన ప్రజాసేవ, సంక్షేమ పాలన, అభివృద్ధి దృక్పథానికే నిదర్శనమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో, నల్లమల్ల పులి ––కొండారెడ్డిపల్లె ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ఒకవైపు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ జడ్పీటీసీ –బండారు సత్యన్నారాయణ హాజరయ్యారు. అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకులు, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి (గడ్డన్నారం మార్కెట్ యార్డ్ డైరెక్టర్), నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, ఎదుల్ల ప్రతాప్ రెడ్డి, గుర్రం నరసింహారెడ్డి, లింగారెడ్డి, గుర్రం గూడ మాజీ సర్పంచ్ నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి నరసమ్మ, శ్రీనివాస చారి, వెంకటేష్ గౌడ్, వినోద్ నాయక్, వెంకటేష్ గౌడ్, జూపల్లి రవీందర్ రావు, విజయ్, రఘు, సుధాకర్ రెడ్డి, రామిడి దిలీప్ రెడ్డి, రామిడి సత్తి రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత, చిన్నారులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

**జిల్లా ఉప సర్పంచుల ఫోరం కమిటీ అధ్యక్షులుగా ఆంగోత్ భాస్కర్ నాయక్ ఎన్నిక**

**రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్**




మహేశ్వరం, జులై 08, (ప్రజా కలం)

జిల్లా ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచుల ఫోరం కమిటీ అధ్యక్షులుగా ఆంగోత్ భాస్కర్ నాయక్ అన్నారు. రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఉపసర్పంచ్ల ఫోరం రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఆంగోత్ భాస్కర్ నాయక్ రామచంద్ర గూడెం ఉపసర్పంచ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ గా కుమ్మరి నరేష్, ఉపాధ్యక్షులుగా జి బాలరాజు, ప్రభాకర్, యాదగిరి రెడ్డి , లాల్ సింగ్ ను ప్రధాన కార్యదర్శిగా ముక్కు పోగుల ప్రకాష్ గౌడ్, గౌరవ అధ్యక్షులు ఆర్ శివకుమార్ లను నియమించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు మల్కయ్య, గోవర్ధన్ రెడ్డి శంషాబాద్ మండల కమిటీ అధ్యక్షులు నందు, మహేశ్వరం మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షులు శివకుమార్, కొత్తూరు మండల అధ్యక్షులు ఆరోగ్యం, కర్తాల్ మండల అధ్యక్షులు లక్పతి నాయక్, ఆమనగల్ మండల అధ్యక్షులు కుమార్, తలకొండపల్లి మండల అధ్యక్షులు భాస్కర్ నాయక్, యాచారం మండల అధ్యక్షులు అనిల్ కుమార్,మంచాల మండల అధ్యక్షులు యాదగిరి గౌడ్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన భాస్కర్ నాయక్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు జిల్లాలో ఉన్న ఉప సర్పంచ్ల ఫోరం తరపున ఉప సర్పంచ్ల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు

## రైతుల కు న్యాయం చేయకుండా భూములను తీసుకుంటే సిపిఐ పోరాటం చేస్తాం

**-సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు**



శంషాబాద్, జులై 08,(ప్రజా కలం)

రైతుల కు న్యాయం చేయకుండా భూములను తీసుకుంటే సిపిఐ పోరాటం చేస్తాం అని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు అన్నారు. రైల్వే టెర్మినల్ కోసం బస్టాండ్. రోడ్ల కోసం పంటలు పండించే బాదర్గూడ రైతుల భూములను నిబంధనలకు విరుద్ధంగా లోపాయి కారు ఒప్పందంతో రైతులను మోసం చేసిన రైతులకు అన్యాయం చేస్తే సిపిఐ బాదరగూడ రైతుల తరఫున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. బుధవారం నాడు విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి మండల కార్యదర్శి నర్రగిరి తో కలిసి ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల కింద సుమారు 650 ఎకరాలు ప్రభుత్వం ఆనాడు పేదలకు భూములను ఇచ్చింది ఆనాటి నుండి నేటి వరకు రైతులు ఆ భూములలో పంటలు పండించుకుంటూ జీవిస్తున్నారు. వారిలో సగం మందికి పట్టాలు లేకపోయినా అనుభవిస్తున్నారు ఇప్పుడు ఉన్న అధికారులు పట్టాలు ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వం నుండి సహకారం ఉంటుందని పట్టాలు లేని వారికి ఎలాంటి సహకారం ఉండదని చెప్పడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారులు ఎలాంటి పక్షపాత ధోరణలు ప్రదర్శించకుండా ప్రభుత్వాన్నిబంధనలను ఉల్లంఘించకుండా పేద రైతులకు అందరికీ సమన్యాయం జరిగే విధంగా చూడాలని పర్వతాలు కోరారు. రైతులకు అన్యాయం జరిగితే కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వారి తరఫున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకై చెట్లని పెంచాలి వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్

**ప్రజ్ఞ హై స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం**

కూకట్ పల్లి జూలై 08, ప్రజా కలం ప్రతినిధి:

పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని ప్రజ్ఞా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వనమహోత్సవంలో భాగంగా ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు ఉపాద్యాయులు పాల్గొని చెట్లను నాటారు. అనంతరం ప్రీతమ్ యాదవ్ మాట్లాడుతూ హరిత హారం వనమహోత్సవంలో చెట్ల యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమం ముఖ్య అతిధులుగా పాపి రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు చంద్రారెడ్డి, అస్బెస్టోస్ కాలనీ అధ్యక్షులు నరేష్ రాము హాజరై, మొక్కలు నాటి చెట్ల యొక్క ఉపయోగలను పిల్లలకు తెలియ జేశారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు చెట్ల గురించి అవగాహనా కల్పించారు. తెలంగాణను పచ్చని పొలిమేరగా మార్చేందుకు ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందిన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రూ.4 కోట్ల నిధులతో సంగారెడ్డి మున్సిపాలిటీ లో సిసి రోడ్ పనులను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**- రూ. 1.40 కోట్లతో 11 వ వార్డు శిల్పా వెంచర్ లో సిసి రోడ్**

**-రూ.1.60 కోట్లతో 33 వ వార్డులో సిసి రోడ్**

**- రూ. 1 కోట్లతో 28 వ వార్డు లో సిసి రోడ్**

సంగారెడ్డి ప్రతినిధి జులై 08( ప్రజా కలం):

టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి బుధవారం సంగారెడ్డి మున్సిపాలిటీ లో రూ. 4 కోట్లతో చేపట్టిన సిసి రోడ్ పనులను ప్రారంభించారు. 11 వ వార్డు లోని శిల్పా వెంచర్ సిసి రోడ్ పనులను ప్రారంభించారు. అనంతరం 33 వ వార్డు, 28 వార్డుల్లో సిసి రోడ్ పనులను సైతం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డి సహకారం తో సంగారెడ్డి మున్సిపాలిటీ లో పనులు ప్రారంభమవుతున్నాయని, రానున్న కాలంలో మరిన్ని నిధులతో సంగారెడ్డి లో ప్రతీ వార్డ్ లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నరు. ఈ కార్యక్రమం లో ఋన్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డి ఈ రఘు రాథోడ్,, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, నాయకులు కూన సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ , నాయకులు మహేష్, రవి నాయక్, తులసి రామ్, దశరథ్ రెడ్డి, శైలేష్ రెడ్డి, శ్రీశైలం, సతీశ్ రెడ్డి, నవాజ్, అశ్విన్, కో ఆప్షన్ సభ్యులు బబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం .

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**



సంగారెడ్డి, ప్రతినిధి జులై 8( ప్రజా కలం):

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏపీఎంలు, ఏపీవోలు, ఎంపీఓలు, డీపీఎంలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్ నుండి వీసీ ద్వారా వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్, వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఎస్టిమేషన్ జనరేట్ చేయాలన్నారు. అలాగే వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ సోక్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను కూడా వేగవంతం చేసి గ్రామాల్లో పారిశుధ్యం, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రతి వారం కనీసం రెండుసార్లు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, రూఫ్ లీకేజీలు, మరుగుదొడ్లు, స్టోరేజ్ రూములు, విద్యుత్ సౌకర్యాలు తదితర మౌలిక వసతులను పరిశీలించి లోపాలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులందరితో ఎంపీడీవోలు క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అన్ని అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ఏడు మండలాల్లో ప్రతిపాదిత 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, అలాగే బీఎస్ఎన్ఎల్ టవర్లు, వివో భవనాల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆయా తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీపీఓ మల్లారెడ్డి, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలరాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హరివిల్లులో భక్తి సందడి..- వీరాంజనేయుడి సన్నిధిలో మాణిక్ యాదవ్..

పటాన్‌చెరు, జులై 8 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్ పరిధిలోని హరివిల్లు కాలనీలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు ఐశ్వర్యసంపదలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో ఆలయ కమిటీ చేస్తున్న సేవలను అభినందిస్తూ,ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, కాలనీ పెద్దలు, భక్తులు ఐలాపూర్ మాణిక్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు,



కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశారు. చివరగా శ్రీ వీరాంజనేయస్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు..



## కుకునూరు ZPHS పాఠశాలలో ఘనంగా సోషల్ ఆడిట్ - ఉపాధ్యాయ బృందానికి ప్రశంసలు!

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 08:

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ 'సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్' (సెస్) ప్రతినిధి, సోషల్ ఆడిటర్ చల్లూరి శివకుమార్ బుధవారం స్థానిక కుకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాసూ)లో సమగ్ర సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ప్రాంగణాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల ఫర్నిచర్, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, మరియు క్రీడా మైదానాన్ని ఆడిటర్ నిశితంగా తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాల పరిశీలన:కేవలం వసతులే కాకుండా, ఉపాధ్యాయుల డిజిటల్ బోధనా పద్ధతులు, సైన్స్ ల్యాబ్స్ వినియోగం, గ్రంథాలయ పుస్తకాల పంపిణీని ఆయన అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల రోజువారీ హాజరు



శాతం, వారికి అందుతున్న స్కాలర్‌షిప్‌లు, ఆట వస్తువుల లభ్యతపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను కూడా ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు టి. హరి చరణ్, గ్రామ్రాజ చైర్‌పర్సన్ మర్రి రూప సమక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆడిటర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పాఠశాల విద్యాతీరు, అందుతున్న సౌకర్యాలపై వారి వ్యక్తిగత అభిప్రాయాలను అడిగి రికార్డు చేసుకున్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, వసతులు అద్భుతంగా ఉన్నాయని సోషల్ ఆడిటర్ చల్లూరి శివకుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులు డాక్టర్ పతాని గంగాధర్, శ్రీధర్ రావు, మల్కన్నా, రవీందర్, నాగరాజు, హరిత, అశోక్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ సేకరించిన సమగ్ర వివరాలతో కూడిన నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలు విద్యార్థులకు ఏ మేరకు చేరుతున్నాయో తెలుసుకోవడానికి ఇలాంటి ఆడిట్‌లు ఎంతో ఉపయోగపడతాయని హెచ్.ఎమ్ టి. హరి చరణ్ తెలిపారు. భవిష్యత్తులో విద్యాసంస్థల మరింత అభివృద్ధికి ఈ నివేదికలు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న చల్మెడ

వేములవాడ, జూలై 8 ( ప్రజా కలం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన చెన్నమనేని రాంగోపాలరావు కుమారుడు రామకృష్ణారావు వివాహ వేడుక బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ



వేడుకకు బీఆర్‌ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డితో కలసి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో ఆయన వెంట నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, సీనియర్ నాయకులు గజానందరావు, కిషన్‌రావు, రాధాకిషన్‌రావు, గోస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, సత్యనారాయణరెడ్డి, పులి రాంబాబు, అంజద్ పాషా, ప్రేమ్ చారి, సందీప్, ఉమర్, అసద్, వకీల్, దేవరాజు, విక్కుర్తి సాయి, అల్లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడ, జూలై 08 ట ప్రజా కలం ప్రతినిధిఊ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ 7వ వార్డు కౌన్సిలర్ ఎల శ్రీనివాస్ తండ్రి రాజయ్య ఇటీవలే పాముకాటుతో మృతిచెందారు, ఆయన మృతిపట్ల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



# వేములవాడలో ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు

### -వైఎస్సార్ ఆశయాలతోనే సంక్షేమ పాలన.
### - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.









వేములవాడ, జూలై 08 ( ప్రజా కలం ప్రతినిధి ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు వేములవాడ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మహంకాళి చౌరస్తా వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని పాలనలో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న మహానేత వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఆయన, పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తమ ప్రాంత సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేయగా వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదే సందర్భంగా రైతుబంధు నిధులు ఖాతాల్లో జమ కావడంతో పలువురు రైతులు ప్రభుత్వ విప్‌ను కలిసి హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ పెట్టుబడులకు రైతుబంధు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ రైతులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూము మధు, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి డీఆర్ఎఫ్ సన్నద్ధం

### - అత్యవసర పరిస్థితుల్లో క్షణాల్లో స్పందించాలి.
### -అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశం.



వేములవాడ, జూలై 8 ( ప్రజా కలం ప్రతినిధి) : వర్షాకాల నేపథ్యంలో వరదలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఆపదలో చిక్కుకున్న ప్రజలకు వెంటనే సహాయం అందించేలా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. బుధవారం వేములవాడ మండలం నాంపెల్లి గ్రామ చెరువులో నిర్వహించిన డీఆర్ఎఫ్ శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు.

ఆర్ఐ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులతో కూడిన డీఆర్ఎఫ్ బృందం చేపట్టిన రెస్క్యూ విన్యాసాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెస్క్యూ బోటులో ప్రయాణించి సహాయక చర్యల సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ.. అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆపద సంభవించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా డీఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు, మోటార్, మెడికల్ స్ట్రెచర్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, వుడ్ కట్టర్ యంత్రాలు తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం, డీఆర్ఎఫ్ బృందం 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. గత ఏడాది వరదలు, గణేష్ నిమజ్జనాల సందర్భంగా డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సేవలను ఎస్పీ ప్రశంసించారు. అదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రతి అత్యవసర పరిస్థితిలో వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఆర్ఐ (అడ్మిన్) సురేష్, ఆర్ఎస్ఐలు సాయి కిరణ్, శ్రావణ్ యాదవ్‌తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆత్మవిశ్వాసమే ఉద్యోగ అస్త్రం

### స్పష్టత..ఆత్మవిశ్వాసమే ఉద్యోగ విజయానికి మార్గం..

పటాన్‌చెరు, జులై 8 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రాంగణ నియామకాలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు స్పష్టత,ఆత్మవిశ్వాసం సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శిక్షణ మార్గదర్శకత్వం,కెరీర్ గైడెన్స్ (టీఎంసీజీ) కేంద్రం డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2027 పట్టభద్రుల కోసం నిర్వహించిన మానవ వనరుల ఇంటర్వ్యూ ప్రశ్నలపై పట్టు సాధించడం అంశంపై ఆన్‌లైన్ కెరీర్ సన్నద్ధత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మంచి జీవిత వివరాల పత్రం ఇంటర్వ్యూకు అవకాశం కల్పించినా,ఉద్యోగాన్ని నిర్ణయించేది మానవ వనరుల ఇంటర్వ్యూనేనని తెలిపారు. స్వీయ పరిచయం, బలాలు, బలహీనతలు,విజయాలు, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇవ్వాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు సంభాషణా నైపుణ్యాలు,సానుకూల వైఖరి విజయానికి కీలకమని డాక్టర్ రోజీనా మాథ్యూ పేర్కొన్నారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల్లో విద్యార్థులు నియామక ప్రక్రియపై అవగాహన పెంచుకుని,తమ ఇంటర్వ్యూ సన్నద్ధత మరింత మెరుగుపడిందని తెలిపారు..




## పాముకాటు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది

వేములవాడ, జూలై 08 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ 7వ వార్డు కౌన్సిలర్ ఎల శ్రీనివాస్ తండ్రి రాజయ్య ఇటీవల పాముకాటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య మృతిపట్ల



ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ విప్ వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూము మాధు, కో-ఆప్షన్ మెంబర్ దుర్గం విజయ్ పరశురాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, నాగుల విష్ణు, బొడ్డు లక్ష్మణ్, కాసరపు తిరుపతి,తదితరులు ఉన్నారు.

## వైఎస్సార్ జయంతి ఘనంగా.. - వైఎస్సార్ ఆశయాలు ఆదర్శం: శశిధర్ రెడ్డి..

పటాన్‌చెరు, జులై 8 (ప్రజా కలం) ప్రతినిధి

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా అమీన్పూర్ మున్సిపాలిటీ బీరంగూడ కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు



లర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, 104 ఆరోగ్య సేవలు,ఇందిరమ్మ గృహ నిర్మాణం,జలయజ్ఞం,ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్ యాదవ్, మల్లేష్ యాదవ్, మహేష్, చుక్క రెడ్డి, కృష్ణ యాదవ్, సురేష్ నాయక్, మస్తాన్ నాయుడు, గోవిందు, రమేష్, ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు..



# మండలంలో సౌకర్యాలు లేని ప్రభుత్వ హాస్పటల్-- దాసరి పాండు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

బొమ్మలరామారం (ప్రజాకలం) జూలై 8:

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్ లో ఎలాంటి సౌకర్యాలు రైతులకు,ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండుఅన్నారు బుధవారం రోజున సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బొమ్మలరామారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక నిధులు కేటాయిస్తూ అన్ని రకాల అభివృద్ధి చేస్తున్నామని నిత్యం గొప్పలు చెప్పుకుంటున్నది కానీ ప్రభుత్వ హాస్పిటల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు మండలంలో సుమారు 37,582 మంది జనాభా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేక రోజువారీగా వైద్యం కోసం వస్తున్న ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నాయని అని అన్నారు ఎమర్జెన్సీ చికిత్స నిమిత్తం పాము కరిసిన ఇతర అత్యవసర వైద్య కోసం వచ్చిన పేషెంట్లకు అత్యవసరంగా మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రం లేదా ఇతర హాస్పటల్ కు పంపడం కోసం అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అని అన్నారు కాకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా డాక్టర్స్ లేరని డాక్టర్స్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, ల్యాబ్ పరికరాలు లేవని అన్నారు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు శానిటేషన్ సమస్య ఉన్న అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు ప్రభుత్వ దావఖానాలో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులకు పడుతున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా మండల కేంద్రంలో ఉన్న హాస్పటల్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు దేశెట్టి సత్యనారాయణ, మైలారం లక్ష్మయ్య ,హరి తదితరులు పాల్గొన్నారు



# డా.వైఎస్సార్ జయంతి వేడుకలు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతినగర్ డివిజన్ (276)లో వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన 77వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిధిగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి దివంగత రాజశేఖర్ రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. పేద ప్రజలకు రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలకు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రగతినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వరరెడ్డి (తాతిరెడ్డి), సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఎవి రెడ్డి, వీరబాబు గౌడ్, డాక్టర్ మద్ది నారాయణరెడ్డి, బండ్ల విజయ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, పర్వతిని ఆంజనేయ వర్మ, బత్తుల చిరంజీవి, సయ్యద్ రఫత్, దాసరి మహేష్,మేడ శ్రీను,సురేందర్ యాదవ్,రవీందర్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

# వ్యాపార కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు

- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న స్వామి దయానంద్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్
- పుస్తకాలు,దుస్తులు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తోంది
- ఎల్‌కేజీకి 5 నుంచి 10 వేల వరకు ఫీజులు వసూలు - విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం
- స్వప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రైవేట్ పాఠశాలలు



హైద్రాబాద్ జూలై 8 (ప్రజాకలం న్యూస్)

విద్యను వ్యాపారం చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నెత్తిన శటగోపంపెడుతున్న ప్రైవేటు పాఠశాలల తీరు క్షమించరానిదని, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ అంబర్‌పేట్ కార్యదర్శి నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు బుధవారం అంబర్‌పేట్‌లోని బాఘ్‌లో ఉన్న స్వామి దయానంద్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించి, ఆ పాఠశాల ఫీజులు దుర్వినియోగం చేస్తూ, పుస్తకాలు, దుస్తులు అమ్ముతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తోందని మీడియాకు వెల్లడించారు. విద్యా అధికారులు తనిఖీలు చేయకపోవడమే వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. అంబర్‌పేట్‌లోని అనేక పాఠశాలలు విద్యార్థుల జీవితాలతో వ్యాపారం చేస్తూ చెలగాటం ఆడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఫీజుల దుర్వినియోగాన్ని అరికట్టాలని విద్యార్థి నాయకుడు నాగేందర్ విద్యా అధికారులను డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయవద్దని, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు, బూట్లు అమ్మవద్దని జూన్ నెలలోనే అన్ని ప్రైవేట్ పాఠశాలలకు మేము నోటీసులు జారీ చేశాం. ఈలోగా, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నోట్‌బుక్‌లు, యూనిఫాంలు, బూట్లు అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అటువంటి పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.



# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## రైతు భరోసా సంబరాలు-

## -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చీర సత్యనారాయణ

బొమ్మలరామారం, ప్రజా కలం జూలై 8

రైతు భరోసా సంబరాలలో భాగంగా ప్రతి గ్రామంలో ఘనంగా రైతుబంధు సంబరాలు చేసుకున్నారు.మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీర సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజులలో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను జమ చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటాలకు బుధవారం రోజున పాలాభిషేకం నిర్వహించారు.కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీర సత్యనారాయణ మాట్లాడుతూ..రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి రైతు భరోసా పథకం ఎంతో ఉపయోగపడుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైస్ రాజేష్ పైలెట్, సింగిర్తి మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు యాంజాల కళ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామిడి శ్రావణ్ ప్రసాద్ రెడ్డి, శ్రీరాములు నాయక్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మైలారం సుదర్శన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫకీర్ సంగీత, రామిడి జంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రామిరెడ్డి రామిరెడ్డి, నాగినేనిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు పర్రె యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మర్‌పల్లి మండల సర్పంచ్‌ల ఫోరం ఏకగ్రీవం

## : అధ్యక్షురాలిగా నలిమేల రేవతి గంగారెడ్డి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)జూలై 08:

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌ల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమ్మర్‌పల్లి మండల సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల సర్పంచ్‌ల ఫోరం నూతన అధ్యక్షురాలిగా



హస కొత్తూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి నలిమేల రేవతి గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కేసీ తాండ సర్పంచ్ లాకావత్ సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కొనసముందర్ గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం సలహాదారుగా చౌట్‌పల్లి గ్రామ సర్పంచ్ ఎండీ మహబూబ్‌ను నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు రేవతి గంగారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మండలంలోని సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి, సర్పంచ్‌ల సంక్షేమం కోసం అందరం ఐక్యంగా పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

## అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 08 :

గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్ లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు, తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింకు రోడ్లు, సీ.సీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగు నీటి సరఫరా పర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ లు, కార్యదర్శులు పరస్పర సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, తద్వారా సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్దేశిత పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చని సూచించారు. ఏ గ్రామానికి ఏం అవసరం ఉ




ంది అన్న వివరాలను ప్రభుత్వం తెలుసుకునేందుకు, తద్వారా అవసరమైన నిధులు, తగిన వనరులను సమకూర్చేందుకు గ్రామ పంచాయతీల సమగ్ర ప్రణాళిక దోహదపడుతుందని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తిస్తూ, 2026 -- 2029 కాల పరిమితితో కూడిన మూడు సంవత్సరాలకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని అన్నారు. అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని హితవు పలికారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకు వెళ్తే పల్లెలన్ని సంపూర్ణ ప్రగతితో వికసిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవగాహన సదస్సు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు, సర్పంచ్ లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



# 'మన ఊరు మన భద్రత'

## - 31 సీసీ కెమెరాలను ప్రారంభించిన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 8: ప్రజల రక్షణ, నేరాల నివారణే ధ్యేయంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్, జాకోర గ్రామ పంచాయతీ కార్యాలయాలలో బుధవారం ఉదయం "మన ఊరు మన భద్రత – మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 31 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్., ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సురక్షిత జీవనానికి సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అభినందనీయ మన్నారు. "ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను వీటి ద్వారా సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

సీసీ కెమెరాల సంఖ్య: శ్రీనగర్ గ్రామంలో 15, జాకోర గ్రామంలో 16 కెమెరాలు (మొత్తం 31).

వ్యాపారులకు సూచన: ప్రతి దుకాణ యజమాని తప్పనిసరిగా తమ ప్రాంగణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రజల భాగస్వామ్యం: కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలి. అవగాహన: శ్రీనగర్, జాకోర గ్రామ ప్రజలకు డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల ముప్పు, రోడ్డు ప్రమాదాల నివారణపై సీపీ పలు జాగ్రత్తలను సూచించారు. భద్రత కోసం




చొరవ చూపి, పోలీసు శాఖకు సహకరించిన శ్రీనగర్, జాకోర గ్రామ పంచాయతీలను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉమ్మడి భద్రతా కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, వర్ని ఎస్సై జి. వంశీ కృష్ణ, కోటగిరి ఎస్సై శ్రీనివాస్, రుద్రూర్ ఎస్సై మనోజ్ పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులలో శ్రీనగర్ సర్పంచ్ పూర్ణిమ కిరణ్, జాకోర సర్పంచ్ బి. పెద్ద సాయిలు, మాదాల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సుబ్బారావు, సెక్రెటరీ ఠాకూర్, రిటైర్డ్ సైంటిస్ట్ తోట చేతన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కె. సురేష్ బాబు, ఉప సర్పంచ్ దస్తగిరి, బాలవికాస్ ట్రస్ట్ సభ్యులు చంద రాములు బాలయ్య, సాదిక్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# యాదగిరిగుట్టలో తిరుమల తరహాలో సౌకర్యాలు

## రాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం సభ్యులు.

హైదరాబాద్, యాదాద్రి, జూలై 08 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసిం హస్వామి ఆలయాన్ని సందర్శించే భక్తులకు... తిరుమల స్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని వైటీడీ పాలక మండలికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అదే స్థాయిలో ఆలయ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జూన్ 30న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలయ పాలకమండలిని నియమించింది. ఈ నెల 11న వీరు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం చైర్మన్ మన్నె సత్యనారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌బోర్డుకు నియమితులైన వారిని ఆయన అభినందించారు. సీఎం కలిసినవారిలో సభ్యులు వినోద్ వెంకటస్వామి(ఎమ్మెల్యే), కొణిదల సురేఖ, సి.విజయరాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, డాక్టర్ మల్లయ్య, స్వాతి కంఠమనేని, ఎం.రాఘవేందర్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణనా యక్, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, ఈవో భవానీశంకర్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన నాయకుడు వైయస్ ఆర్ - మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి,జూలై 08 (ప్రజా కలం ప్రతినిధి)

సర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమ లక్ష్యంగా పనిచేసిన గొప్ప నాయకుడని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. ఉమ్మడి



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మౌలాలి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసినా కార్యక్రమానికి మైనంపల్లి హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పేదలు విద్యార్థులు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజా గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు.ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో ప్రతి నాయకుడు నడుచుకునేలా ముందుకు సాగాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మౌలాలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 51 హెల్ప్‌డెస్క్ కేంద్రాలను ఏర్పాటు

### హెల్ప్‌డెస్క్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన-ఉప కమిషనర్ వి సమ్మయ్య

మహేశ్వరం, జులై 08,(ప్రజా కలం).

ప్రత్యేక సమగ్ర సవరణ బడంగ్పేట్ సర్కిల్-16 ఏరో పరిధిలో 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 51 హెల్ప్‌డెస్క్ కేంద్రాలు -- ఉప కమిషనర్ వి సమ్మయ్య పరిశీలించారు.ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ -2026) లో భాగంగా ఎరో బడంగ్పేట్ పరిధిలోని 138 పోలింగ్ కేంద్రాల ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పూరణలో సహాయం అందించేందుకు మొత్తం 51 హెల్ప్‌డెస్క్ కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు ఉప కమిషనర్ వి సమ్మయ్య తెలిపారు.ఈ సందర్భంగా పలు హెల్ప్‌డెస్క్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు, ఓటర్లకు అందుతున్న సేవలను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌లకు వచ్చే ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పూరణలో పూర్తి సహకారం అందించడంతో పాటు, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.అదేవిధంగా, ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్ప్‌డెస్క్ కేంద్రాలకు వచ్చే ప్రతి అర్హత కలిగిన ఓటరికి అవసరమైన మార్గదర్శకత్వం అందించి, ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని అధికారులను ఆదేశించారు.బడంగ్పేట్ ఎరో పరిధిలోని 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతి అర్హత కలిగిన ఓటరు తమకు సమీపంలోని హెల్ప్‌డెస్క్ కేంద్రాలను వినియోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించి సమర్పించాలని ఉప కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# మహేశ్వరంలో వైయస్సార్ 77వ జయంతి వేడుకలు

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్

మహేశ్వరం, జులై 08, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైయస్ రాజశేఖరరెడ్డి గారి 77 వ జయంతి ఉత్సవాల సందర్భంగా విగ్రహం పునర్ ప్రతిష్ట కార్యక్రమం తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో దేపా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్ రాజశేఖర్ రెడ్డి ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ గుండెల్లో నిలుపుకున్నారని ఎన్నటికీ ఆయన చేసిన సేవలు మరువలేరని ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఈరోజుకి కొనసాగిస్తున్నా మని ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారు కొనసాగిస్తున్నారని ఇంకా ముందు ముందుకు ఆయన ఆశయాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం



మండల నాయకులు కార్యకర్తలు వైయస్సార్ అభిమానులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, మహేశ్వరం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఉప్పుగడ్డ గ్రామ సర్పంచ్ రాజు నాయక్, కోళ్ల పడకల్ గ్రామ సర్పంచ్ చెపంగి ప్రవీణ్, తుప్పర కుర్దు గ్రామ సర్పంచ్ గొల్లూరి రాజు, గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, నందుపల్లి గ్రామ సర్పంచ్ దేశపాక నరసింహ, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ జావిద్, ఉప్పుగడ్డ గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ నాయక్, తుమ్మలూరు గ్రామ ఉపసర్పంచ్ సంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఈశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల మాజీ అధ్యక్షులు కావాలి దశరథ,

మాజీ ఎంపిటిసి సభ్యులు పాండు నాయక్, పరిగి రాఘవేందర్ రెడ్డి,కార్మిక విభాగం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు నడి కూడా శివ, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ దోమ శ్రీనివాస్ రెడ్డి, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ పోతర్ల తిరుపతయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, మహేశ్వరం గ్రామ 7వ వార్డు సభ్యులు ఒత్తుల శాలిని సన్నీ కుమార్, మహేశ్వరం మండలం సీనియర్ నాయకులు సుధాకర్, కాకి యాదగిరి ముదిరాజ్ ,గద గూటి జంగయ్య ముదిరాజ్, ఇంద్రకంటి నరసింహ గౌడ్, ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, సోషల్ మీడియా మాజీ కోఆర్డినేటర్ ఏపూరి నరసింహ, మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, సేవాదళ్ మండల అధ్యక్షులు శెట్టి అశోక్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడా రాకేష్ ముదిరాజ్, మహేశ్వరం పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్ణగంటి ఆకాష్, యూత్ కాంగ్రెస్ నాయకులు కాకి శివరామకృష్ణ ముదిరాజ్, మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్,10 వ వార్డు ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్,13 వ వార్డు ఇంచార్జ్ అనిల్ నాయక్, 14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పిక్కెట్ డిపో పరిధిలో రేపు 'డైల్ యువర్ డీఎం' కార్యక్రమం

కంటోన్మెంట్:జులై 8:ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సికింద్రాబాద్‌లోని పిక్కెట్ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా 'డైల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జూలై 9వ తేదీ గురువారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పిక్కెట్ డిపో మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుతం ఈ డిపో నుండి శ్రీశైలం, విజయవాడ, కర్నూలు, కడప, మార్కాపురం, ఆదిలాబాద్, దుబ్బాక యాదగిరిగుట్ట వంటి ప్రధాన రూట్లలో ఆర్టీసీ బస్సులు నడుపబడుతున్నాయి.

ఈ రూట్లలో ప్రయాణించే వారు సాధారణ ప్రయాణికులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేయడానికి, అలాగే రవాణా సేవల మెరుగుదలకు అవసరమైన విలువైన సలహాలు, సూచనలు అందించడానికి నేరుగా డిపో మేనేజర్ ఫోన్ నెంబర్ 9959226250 కు కాల్ చేసి మాట్లాడవచ్చునని ఆయన కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.



# కంటోన్మెంట్ లో డబుల్ డ్రామా?

## బాధితుల పోరాటం, అధికారుల ఆరాటం?

## కోర్ట్ ఆదేశాలు సైతం భేఖాతారు..లబ్ధిదారులకు పట్టాలు?

కంటోన్మెంట్:జులై 8:ప్రజాకలం ప్రతినిధి

కంటోన్మెంట్ నియోజకవర్గంలో డబుల్ డ్రామా సాగుతోంది. పేదల కోసం నిర్మాణం చేసిన ఇండ్ల పంపిణిలో లబ్ధిదారులు అన్యాయం జరిగిందని బోరోన మొట్టుకున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు న్యాయ పోరాటం చేస్తుంటే.. అధికారులు ఇండ్ల పంపిణీ చేసిన చేతులు దులుపు కున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫామ్ డి పేరుతో దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలో తమకు భూమి పట్టాలు ఇచ్చారని వారు తెలిపారు. అందుకు సంబందించిన పత్రాలను బయట పెట్టారు. ఆనాటి నుంచి అదే స్థలంలో నివాసమున్నట్లు తెలిపారు. కాగా కెసిఆర్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం తమ భూమి తీసుకున్న అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.కానీ ఆ





హామీ అతకెక్కిందని బాధితులు బోరున విలపించారు.ఇక స్థానిక ఎమ్మార్వో,ఆర్ డిఓ చుట్టూ తిరిగి తిరిగి కళ్ళు అరిగాయాన్ని విలపించారు. చివరికి న్యాయం చేయాలని కోరితూ కోర్ట్ ను అశ్రాయించారు. కోర్ట్ ఆదేశాలు జారీ చేసినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఆ ఆదేశాలలను సైతం పట్టుంచుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ పోరాటం ఇలా ఉంటే అధికారులు మాత్రం తమ పని తాము చేసుకుంటూ వెళ్లుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. డబుల్ బెడ్ రూమ్ లు పంపిణీ చేయగా మిగిలినవి భూమి ఇచ్చిన యాజమానులకు ఇవ్వాలని కోరారు. ఐనా ఎటువంటి స్పందన లేదన్నారు. బాధితులు డబుల్ బెడ్ రూమ్ కోసం ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే ఇండ్ల పంపిణీ చేయడం మరో విశేషం.అంటే అధికారం ఎలా వ్యవహారిస్తు న్నారో వారి క్రియల్లోనే అర్థం అవుతుంది. కేవలం కొందరికి లబ్ధి చేకూరేలా అధికారులు వ్యవహారిస్తున్నారు అన్న ఆరోపణలు లేకపోలేదు. అధికారుల పై ఎవరైనా ఒత్తిడి చేస్తున్నారా? అన్న అనుమానం తలెత్తుతుంది. ఇక స్థానికంగా పనిచేస్తున్న ఓ అధికారి ఏకంగా 15 రోజులు సెలవుల పై వెళ్లడం కూడా ఈ అనుమానానికి మరింత బలం చేకూరచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి.











Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com